

రైల్వేకోడూరు-వెంకటగిరి
రోడ్డుకు మోక్షం!
- కదులుతున్న ఫైలు
- ప్రభుత్వానికి నివేదిక పంపిన అధికారులు

6



12 లక్షల మొక్కల పంపిణీ

- సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు



మదనపల్లె టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నేడు నిర్వహించనున్న మెగా పీటీఎం 2.0 కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మా కే నామ్ పే' కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 12 లక్షల మొక్కలు పంపిణీ చేశామని మదనపల్లె సబ్ డీఎఫ్‌వో ఎస్.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వారి తల్లి పేరిట ఒక మొక్కను నాటి, వాటిని సంరక్షించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే ఒక్కో మొక్కను నాటేందుకు మొక్కలు పంపిణీ చేశామన్నారు. మదనపల్లె అటవీ సబ్ డివిజన్‌లోని మదనపల్లె, పీలేరు, రాయచోటి, సానిపాయ రేంజ్‌లకు 8 లక్షల మొక్కలు పంపిణీ చేశామన్నారు. జిల్లా నలుమూలల ఉన్న 15 అటవీశాఖ నర్సరీల నుంచి ఆయా మండల కేంద్రాలకు 10 రకాల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మెగా పీటీఎం కార్యక్రమంలో వీటిని విద్యార్థులచే వారు చదువుతున్న పాఠశాలలు, ఇళ్ల వద్ద మొక్కలు నాటించేలా అటవీశాఖ చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు.

జేఎన్టీయూ అధ్యాపకురాలికి రాష్ట్ర స్థాయి అవార్డు

- ప్రదానం చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్



రాష్ట్ర గవర్నర్‌తో అబ్దుల్ నజీర్‌తో ప్రొఫెసర్ అపర్ణ

కలికిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీ అధ్యాపకురాలు, యూత్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ కె.అపర్ణకు రాష్ట్ర స్థాయి ఉత్తమ సేవా అవార్డు లభించింది. బుధవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ శాఖ నిర్వహించిన వార్షిక జనరల్ బాడీ సమావేశం అపర్ణను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. 2017 నుంచి అపర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించడంతో ఆమె అవార్డుకు ఎంపికయ్యారు. కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల యూత్ రెడ్‌క్రాస్ విభాగం విద్యార్థులు ఏడాదిలో మూడు పర్యాయాలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు, రెడ్‌క్రాస్ సంస్థలో జీవిత కాలం సభ్యత్వాలను నమోదు చేయించడంలో ముందున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, ఇతర వర్సిటీ అధికారులు అపర్ణకు అభినందనలు చెప్పారు.

రెండు కార్లు ఢీ

- ఇద్దరు న్యాయవాదులు మృతి
- ఆరుగురికి తీవ్ర గాయాలు



మృతిచెందిన న్యాయవాదులు సుబ్రమణ్యంయాదవ్, రాజగోపాల్ (ఫైల్‌ఫొటోలు)

రాజంపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణ శివారు ప్రాంతంలోని అశోక గార్డెన్ సమీపంలో బుధవారం రెండు కార్లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు సీనియర్ న్యాయవాదులు అక్కడికక్కడే మృతిచెందగా ఆరుగురు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతికి చెందిన మాచుపల్లె సుబ్రమణ్యంయాదవ్ (70), పీలేరుకు చెందిన నూలివేటి రాజగోపాల్ (63) న్యాయవాదులు. వీరిద్దరూ కుమార్‌స్వామి అనే వ్యక్తితో కలసి కోర్టులో కేసు విషయంగా బుధవారం ఉదయం కారులో రాజంపేటకు వచ్చారు. కోర్టులో తమ పనిచూసుకున్న అనంతరం మధ్యాహ్నం తిరుపతికి తిరుగు ప్రయాణం అయ్యారు. కాగా.. రాయచూరుకు చెందిన వంగాల వెంకటేశ్వర్‌రెడ్డి, విజయవర్దన్‌రెడ్డి, శైలజ, హాసిని, శంకరమ్మ తిరుమల దర్శనానికి వెళ్లి హూండాయ్ క్రెటా కారులో తిరిగి వస్తున్నారు. వీరి కారు అదుపు తప్పి రాజంపేట అశోక గార్డెన్ వద్ద ఎదురుగా వస్తున్న న్యాయవాదుల కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు న్యాయవాదులు అక్కడికక్కడే మృతిచెందగా కుమారస్వామితో పాటు మరో కారులోని ఐదుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్లారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదానికి సంబంధించి రాజంపేట మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

అక్రమార్కులకు వారే అండ

- స్థాయి దిగజారుతున్న తహసీల్దార్లు
- ఓ మాజీ ఎమ్మెల్యే పేరుతో రెండెకరాల ఆన్‌లైన్
- అక్రమార్కుల మోచేతి నీళ్లు తాగుతున్న దైన్యం



రెవెన్యూ శాఖలో తహసీల్దార్‌కు మండల మేజిస్ట్రేట్‌గా విశేష అధికారాలు ఉండడంతో మిగిలిన ప్రభుత్వ ఉద్యోగాలతో పోల్చితే ఎంతో విలువ ఉన్న ఉద్యోగం.. అయితే జిల్లాలో కొందరు తహసీల్దార్లు ఎటువంటి భయం లేకుండా.. మానవత్వం కూడా మరచి.. అక్రమార్కుల మోచేతి నీళ్లు తాగుతూ... అక్రమాలకు వత్తాసు పలుకుతున్న తీరు చూస్తే.. తహసీల్దార్లు ఇంతకు దిగజారుతున్నారా అని ప్రజలు అంటున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలం లక్కిరెడ్డిపల్లె గ్రామం సర్వే నెంబరు 705/2లో రెండు ఎకరాల డీకేటీ భూమిని 1978లో టి.ఎన్.సూర్యనారాయణరెడ్డికి ప్రభుత్వం కేటాయించింది. ఈ భూమిని 1986 ఫిబ్రవరిలో లక్కిరెడ్డిపల్లెలోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల అధ్యక్షుడు ఒంటిమిట్ట వెంకటసుబ్బారెడ్డి పేరు మీద సూర్యనారాయణరెడ్డి రిజిస్టర్ చేయించారు. అయితే మరుసటిరోజే శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి.. పొరపాటున ఇదే గ్రామంలోని సర్వే నెంబరు 606కు బదులుగా 705/2 తమకు రిజిస్టర్ చేయించారని ఈ స్థలానికి తమ కళాశాలకు ఎటువంటి సంబంధం లేదని సూర్యనారాయణరెడ్డికి ఒక అగ్రిమెంటు రాయించారు. అప్పటి నుంచీ ఆ స్థలం సూర్యనారాయణరెడ్డి అనుభవంలోనే ఉంది. సూర్యనారాయణరెడ్డి మరణానంతరం ఆయన భార్య సాయిలీల పేరు మీద పట్టాదారు పాసుపుస్తకాలను రెవెన్యూ అధికారులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో తెచ్చిన ఫ్రీహోల్డ్ చట్టం ప్రకారం ఈ స్థలంపైన సాయిలీలకు భూయాజమాన్య హక్కులు వచ్చాయి. అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 2న (ఆదివారం సాయంత్రం) అప్పటి లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు, వీఆర్‌వో కృష్ణప్పలు సాయిలీల పేరు తొలగించి ఓ మాజీ ఎమ్మెల్యే పేరు మీద ఆన్‌లైన్ చేశారు. అతడికి ఈ భూమికి ఎటువంటి సంబంధం లేదు.. అయినా సాయిలీలకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా.. నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్ చేసేశారు. సాధారణంగా ఎవరి పేరు మీద అయినా ఆన్‌లైన్ చేయాలంటే.. అందుకు సంబంధించిన ఆధారాలతో సహా ఒక ఫైల్ తయారు చేయాలి. అయితే దీనికి సంబంధించిన ఫైల్ కూడా తహసీల్దార్ కార్యాలయంలో లేనట్లు సమాచారం. ఈ విషయమై బాధితురాలి కుమార్తె కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా 1986లో ఈ భూమిని సూర్యనారాయణరెడ్డి శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డికి అమ్మడంతో ఆన్‌లైన్ చేసినట్లు తహసీల్దార్ సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. వాస్తవానికి డీకేటీ భూములే కాకుండా.. ప్రైవేటు భూమి అయినా డైరెక్టుగా శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల పేరుతో రిజిస్ట్రేషన్ చేసినా చెల్లదు. కళాశాల సొసైటీ పేరు మీదే లావాదేవీలు జరగాలి. అయితే ప్రలోభాలకు లొంగిన తహసీల్దార్ ఒకరి పేరు మీద పట్టా ఇచ్చిన డీకేటీ భూమిని ఇతరులకు ఆన్‌లైన్ చేయడం నేరమని తెలిసినా మాజీ ఎమ్మెల్యే పేరు మీద ఆన్‌లైన్ చేశాడు. ఈ విషయం కలెక్టర్ దాకా వెళ్లడంతో తన మెడకు చుట్టుకుంటుందన్న భయంతో సాయిలీల నిబంధనలకు విరుద్ధంగా డీకేటీ భూమిని ఇతరులు ఇద్దరికి విక్రయించిందని గత నెలలో ఆ భూమిని స్వాధీనం చేసుకుని బోర్డులు నాటారు. (ఇక్కడ కూడా ఏమాత్రం నిబంధనలు పట్టించుకోలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.) ఎవరికి మేలు చేయడం కోసమో తహసీల్దార్ చేసిన పాపానికి సాయిలీల బలైపోయింది. అక్రమార్కులకు వత్తాసు పలికిన ఈ సంఘటనపై స్పందించిన కలెక్టర్ ప్రస్తుతానికి లక్కిరెడ్డిపల్లె వీఆర్‌వో కృష్ణప్పను సస్పెండు చేశారు. తహసీల్దార్‌ను బదిలీ చేశారు.



సర్వే నెంబరు 705/2లో భూమిలో బోర్డు నాటుతున్న తహసీల్దార్, ఇతరులు (ఫైల్)

- గాలివీడు మండలం నడిమిపల్లెలో ఉంటున్న పులి సునీతకు సర్వే నెంబరు 679/3లో 3.88 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి ఆమె అనుభవంలో ఉన్నప్పటికీ ఆమెకు తెలియకుండా తహసీల్దార్ చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెకు చెందిన బాలాజీబాబు, ఇతరుల మీద ఆన్‌లైన్ చేశారు ఈ విషయమై బాధితులు కోర్టుకు వెళితే సునీత భర్త నాగరాజు మృతి చెందాడని తహసీల్దార్ కౌంటర్ వేశారు. వాస్తవానికి నాగరాజు బతికే ఉన్నాడు. తహసీల్దార్ చేసిన పాపానికి బాధితురాలు సునీత ఇబ్బందులు పడుతోంది. ఈ విషయమై సీపీఐ (ఎంఎల్) అన్నమయ్య జిల్లా కార్యదర్శి విశ్వనాథ్ బాధితురాలి భర్తతో కలిసి ఇటీవల విలేకరుల సమావేశాన్ని కూడా ఏర్పాటు చేసి తహసీల్దార్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జిల్లాలో పలువురు తహసీల్దార్లు చేస్తున్న అకృత్యాలలో మచ్చుకు ఇవి రెండు మాత్రమే. లంచాలకు కక్కుర్తిపడుతున్న కొందరు తహసీల్దార్ల వ్యవహారం.. వైసీపీ ప్రభుత్వంలో కంటే ఈ ప్రభుత్వంలోనే ఎక్కువగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం కాల్చడంతో బయట ప్రపంచానికి తెలిసిందని.. ప్రస్తుతం జరుగుతున్న అనేక ఘోరాలు ఎప్పుడు బయటపడతాయోనని పలువురు పేర్కొంటున్నారు. కేవలం డబ్బు సంపాదనే ధ్యేయంగా అక్రమార్కులతో చేతులు కలిపి బాధితుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి.. తహసీల్దార్ స్థాయి నుంచి దిగజారిపోయిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

గరుడుడిపై గోవిందుడు...

- వేడుకగా సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు

నందలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి సౌమ్యనాథస్వామి మహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలో గరుడ వాహనంపె సౌమ్యనాథుడు ఆలయ ప్రాకారంలో ప్రదర్శనగా వెళ్లి అనంతరం దిగువ వీధి, పేటగడ్డ, బస్టాండు మీదుగా అరవపల్లె వరకు గ్రామోత్సవం కొనసాగింది. అనంతరం అరవపల్లెలోని రైల్వేకాలనీలో మరికొన్ని వీధుల్లో గ్రామోత్సవంగా వెళ్లి నందలూరు బ్రాహ్మణవీధికి చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రత్యేకమైన గరుడ సేవను తిలకించేందుకు విశేష సంఖ్యలో భక్తులు వచ్చారు. ఉదయం పుష్పాలంకరణ ప్రియుడైన సౌమ్యనాథస్వామి మోహిని అలంకారంలో శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



ఉదయం మాడవీధుల్లో శేషవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు



గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న సౌమ్యనాథుడు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ఉదయం సౌమ్యనాథస్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనాలపై భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం
ఎందుకు పెట్టడం లేదు

6

నేడు మెగా పీటీఎం

- 2738 పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు

రాయచోటిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌బాబు ఆదేశాల మేరకు విద్యాశాఖ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మెగా పేరెంట్స్ సమావేశాలు గురువారం జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున జరగనున్నాయి. కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం, డీఆర్‌వో మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. జిల్లాలోని 30 మండలాల్లో 2738 పాఠశాలల్లో జరగనున్న మెగా పేరెంట్స్ మీటింగ్స్‌కు సర్వం సిద్ధం చేశారు. మెగా పేరెంట్స్ మీటింగ్‌లో ప్రధానంగా విద్యార్థుల ప్రగతిపై చర్చించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫామ్, బ్యాగులు, తదితర విద్యా సామగ్రిపై అవగాహన, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందించడం తదితర విషయాలను తల్లిదండ్రులకు తెలియజేసి పాఠశాలల అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేయనున్నారు. ఈ మెగా పేరెంట్స్ మీటింగ్స్‌కు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, డీఆర్‌వో మధుసూదన్ రావు, ఆర్డీవో శ్రీనివాసులు, సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, నిదియాదేవి, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్‌లు, ఎంపీడీవో, ఎంఈవోలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల స్థాయి, అన్నిశాఖల అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొననున్నారు.



రాయచోటిలోని కొత్తపేట రామాపురంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

సుపరిపాలనకు చిరునామా కాంగ్రెస్ పార్టీ

- మీడియా సమావేశంలో డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి

రాయచోటి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు కాంగ్రెస్ పార్టీ చిరునామా అని, వైసీపీ, టీడీపీలకు సుపరిపాలన అంటే అర్థం కూడా తెలియదని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన రాయచోటికి వచ్చిన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేసి పథకాలు, కార్యక్రమాలకు పేర్లు మార్చి కొన్నింటిని కొనసాగించడం, కొన్నింటిని రద్దు చేయడం తప్ప వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు కొత్తగా చేసిందేమీ లేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రంలో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదన్నారు. ఒక్క కడప జిల్లాలోనే 49,838 ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉన్నాయనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా మామిడి కాయలు కొనేవారు లేక గిట్టుబాటు ధర లభించక మామిడి రైతులు లబోదిబోమంటున్నారన్నారు. కన్న బిడ్డల్లా పెంచుకున్న మామిడి చెట్లను నరుకుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇదేనా సుపరిపాలన అని తులసిరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి అల్లాబకష్, చెన్నక్రిష్ణ, బుల్లెట్ బాషా, రమణమ్మ, స్వనజారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

చెరువును తవ్వేస్తున్నారు...!

- జిల్లేళ్లమడక చెరువులో అక్రమంగా తవ్వకాలు
- మూడు రోజుల నుంచి 250 టన్నుల మట్టి తరలింపు



జిల్లేళ్లమడక చెరువులో అక్రమంగా తవ్వుతున్న మట్టి



రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చెరువును కొందరు అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఎక్స్‌కవేటర్లతో తవ్వేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. మూడు రోజుల నుంచి రాత్రి, పగలు అనే తేడా లేకుండా యంత్రాలు పెట్టి 250 టన్నుల మట్టిని తరలించారని గ్రామస్థులు తెలిపారు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బుధవారం ఓబులవారిపల్లె మండలంలోని జిల్లేళ్లమడక చెరువు నుంచి ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వి పది ట్రాక్టర్ల ద్వారా తరలించడం కనిపించింది. రాజకీయ పలుకుబడి కల్గిన వారు ఈ మట్టి తరలింపు వెనుక ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. టన్నుల కొద్దీ మట్టిని బడా రాజకీయ నాయకుల తోటలు, పాట్లు తదితర వాటికి తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. చెరువు సుమారు 100 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు నిండితే చాలామంది రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. చెరువును తవ్వడంతో భారీ గోతులు ఏర్పడ్డాయని, పశువుల మేత కూడా లేకుండా చేస్తున్నారని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లో పడి పశువులు చనిపోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి వెళ్లాలంటే భయపడుతున్నామని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు 10 నుంచి 15 ట్రాక్టర్లు పెట్టి మట్టిని తరలిస్తున్నారని, చాలా వరకు ఇటుక బట్టీలకు ఈ మట్టిని తరలించారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

మట్టిని అనుమతి తీసుకోకుండా తరలిస్తే చర్యలు తీసుకుంటాము. గ్రావెల్ రోడ్ల నిర్మాణాల కోసం మట్టి తరలించేందుకు అనుమతి ఇచ్చాము. ఇటుక బట్టీలకు తరలించేందుకు అనుమతి ఇవ్వలేదు. అనుమతి లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాము.

-మల్లికార్జునరెడ్డి, ఆర్ఐ, ఓబులవారిపల్లె

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- కదం తొక్కిన కార్మికులు



కలెక్టరేట్ గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు

రాయచోటి (కలెక్టరేట్), జూలై 9 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని దేశవ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం రాయచోటిలో కార్మికులు కదం తొక్కారు. మొదటగా అంగన్వాడీ, ఆశా, గ్రామ పంచాయతీ, మున్సిపల్, హమాలీ, బీడీ, విద్యుత్ సమగ్ర శిక్ష కార్మిక ఉద్యోగులు మాసాపేట నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది కోలాట, నృత్య, డప్పు ప్రదర్శనలతో కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. లేబర్ కోడ్స్ అమలు చేస్తున్న బీజేపీ, టీడీపీ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన గళాలతో ధ్వజమెత్తి కలెక్టరేట్ ఎదుట రెండు గంటలు బైఠాయించారు. రైతాంగ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణకు కార్మిక, కర్షకులు సంఘటితమై దీర్ఘకాలిక పోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ బీవీ రమణ, చెన్నయ్య, అక్బర్, శంకర్, ఏవీ రమణ, ఆంజనేయులు, ఆశా వర్కర్లు రమాదేవి, సునంద, నసీబ్‌జాన్, హమాలీ రవి, ఖాదర్, సమగ్ర శిక్ష అలీ, నరసింహా, అంగన్వాడీ వర్కర్లు బంగారుపాప, సిద్దమ్మ, సుమలతలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు మోక్షం!

- కదులుతున్న ఫైలు
- ప్రభుత్వానికి నివేదిక అందించిన అధికారులు
- అటవీశాఖ అనుమతి, రోడ్డు కనెక్టివిటీ కోసం ఫైల్ సిద్ధం


గతంలో ఎస్ఆర్ కాలనీ వరకు వేసిన రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు


అడవి మధ్యలో ఎరుపు రంగులో కనిపిస్తున్నదే రోడ్డు మార్గం

రైల్వేకోడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు కూటమి ప్రభుత్వంలో మోక్షం వచ్చింది. ఆర్అండ్‌బీ అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించారు. అటవీశాఖ అనుమతి, రోడ్డు కనెక్టివిటీ తదితర వాటి కోసం అధికారులు ఫైలు సిద్ధం చేశారు. భూసేకరణ కోసం అయ్యే ఖర్చు కూడా లెక్కలు వేశారు. 35 హెక్టార్ల వరకు భూసేకరణ చేయాల్సి వస్తుందని అంచనాలు వేశారు. రోడ్డు నిర్మాణాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, టర్నింగ్ పాయింట్లు తదితర వాటి కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నివేదికలు తయారు చేస్తామని ఆర్అండ్‌బీ శాఖాధికారులు చెబుతున్నారు. 30 ఏళ్లుగా రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు పెండింగ్‌లో ఉంది. ఇందుకు సంబంధించిన ఫైలు బుట్టదాఖలైంది. గత కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వంలో రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు మంజూరు చేస్తామని హామీలు ఇచ్చిన పాలకులు తర్వాత దాని గురించే మరిచిపోయారు. గత ఏడాది ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రోడ్డు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల దృష్టికి కోడూరు ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిలు స్వయంగా కలసి విన్నవించారు. దీంతో మూడు నెలల క్రితం ఎమ్మెల్యే తో పాటు ఆర్అండ్‌బీ అధికారులు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డును పరిశీలించారు. తర్వాత ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఇందుకు సంబంధించిన ఫైలును సిద్ధం చేసి నివేదికను ప్రభుత్వానికి పంపారు. రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు సంబంధించిన భూసర్వే చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా 30 ఏళ్ల క్రిందట రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు ప్రతిపాదనలు చేసి రైల్వేకోడూరు మార్కెట్ యార్డు నుంచి కేఆర్ కండ్రిక గ్రామం పరిధిలోని ఎస్ఆర్ కాలనీ వరకు 8.9 కిలోమీటర్ల దూరం వరకు తారు రోడ్డు నిర్మించారు. అటువైపు వెంకటగిరి నుంచి లాలాపేట అటవీ సరిహద్దు వరకు 6.3 కిలోమీటర్ల దూరం వరకు తారు రోడ్డు నిర్మాణం చేశారు. మధ్యలో అడవి ఉండడంతో అటవీశాఖ అనుమతులు అప్పట్లో రాకపోవడంతో ఈ రోడ్డు పెండింగ్‌లో పడి పోయింది. అప్పటి నుంచి పాలకులు ఈ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు తెచ్చుకోకపోవడంతో ఈ ఫైలు మరుగున పడిపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే ఈ రోడ్డు ఫైలుకు కదలిక వచ్చింది. ఎమ్మెల్యేతో పాటు పార్టీ ఇన్‌చార్జ్ ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎంలతో కలిసి ఈ రోడ్డు విషయమై చర్చించారు. దీంతో వారి నుంచి సానుకూలమైన స్పందన రావడం, ఫైలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం ద్వారా కదలిక వచ్చింది. ఈ రోడ్డు ప్రారంభమైతే రైల్వేకోడూరు నుంచి వెంకటగిరికి 41 కిలోమీటర్లే. గంటలో వెంకటగిరి చేరుకోవచ్చు. ఇటు వ్యాపారం, అటు మానవ సంబంధాలు పెరుగుతాయి. అదే రైల్వేకోడూరు, రేణిగుంట, ఏర్పేడు మీదుగా వెంకటగిరికి వెళ్లాలంటే 83 కిలోమీటర్ల దూరం వస్తుంది. అదేవిధంగా రైల్వేకోడూరు, చిట్వేలి, రాపూరు మీదుగా వెంకటగిరికి వెళ్లాలంటే 85 కిలోమీటర్ల దూరం వస్తుంది. అందులోను ప్రయాణ గంటలు పెరగడమే కాకుండా వ్యయప్రయాసలు పెరుగుతాయి. రైల్వేకోడూరు నుంచి కొండల మధ్య నుంచి వెళితే ప్రయాణ గంటలు తగ్గడమే కాకుండా వెంకటగిరి నుంచి నెల్లూరు తదితర ప్రాంతాలకు సులువుగా వెళ్లేందుకు బాగుంటుంది. విజయవాడకు ప్రయాణించే వారు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు మీదుగా వెళితే దూరం తగ్గనుంది. వెంకటగిరిలో చీరలు, అరటి కాయలు, బొప్పాయి, మామిడి వ్యాపారం చేసుకునేందుకు వ్యాపారులకు అనువుగా ఉంటుంది. త్వరలోనే రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు భూసర్వే కోసం అనుమతి వస్తుందని, సర్వే పూర్తి కాగానే అటవీశాఖ అనుమతి, తర్వాత బ్రిడ్జిలు, కల్వర్టులు, మెటల్ వర్క్, తారు రోడ్డు తదితర వాటిపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపితే ప్రభుత్వం నిర్మాణ వ్యయ అంచనాలు వేసి నిధులు మంజూరు చేస్తుంది. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభమవుతాయని రైల్వేకోడూరు ఆర్అండ్‌బీ శాఖ డీఈ జయప్రసాద్ వివరించారు.


రోడ్డు తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ (ఫైల్)

లక్కిరెడ్డిపల్లెలో చోరీ


చిందరవందరగా పడేసిన వస్తువులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులందరూ పొలం పనులకు వెళ్లిన సమయంలో దొంగలు తలుపులకు వేసిన తాళం పగులగొట్టి నగలు, నగదు అపహరించుకు వెళ్లారు. బాధితుల కథనం మేరకు మోటారుకు మరమ్మతులు చేస్తుండడంతో మండలంలోని కోనంపేటకు చెందిన కొర్లకుంట రామచంద్రయ్య కుటుంబ సభ్యులందరూ బుధవారం తలుపులకు తాళం వేసి పొలం వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు గడ్డపారతో తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి బీరువాలో దాచిన లక్ష రూపాయలు నగదు, బంగారు నగలు అపహరించికుపోయినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కష్టపడి చదవండి'


అన్నాన్ని పరిశీలిస్తున్న సురేశ్‌కుమార్

సుండుపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులు కష్టపడి చదవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, సుండుపల్లె మండల ప్రత్యేక అధికారి సురేశ్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని పుల్లారెడ్డిగారిపల్లె గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించారు. అన్నం, కూరలు నాణ్యతగా చేసి విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం పాఠశాలలోని స్టోర్‌రూమ్, డార్మిటరీ, టాయిలెట్స్, గార్డెన్, తరగతి గదులను పరిశీలించారు. రాత్రిపూట గదుల నుంచి బయటికి రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కష్టపడి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కాంపౌండ్ వాల్ లేకపోవడం వలన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనలపై కేసు నమోదు

పెనగలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేర్వేరు చోట్ల మంగళవారం రాత్రి జరిగిన సంఘటనలపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలో స్థిరపడిన శివశంకర్‌రెడ్డి, ఆయన కుమారుడు వర్షిత్‌రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి రాజంపేటకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న కారు జగ్గంపేటలో స్కూటీపై వెళుతున్నవారిని ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. మరికొంత దూరం వెళ్లిన తర్వాత ఆటోను ఢీకొనడంతో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయని ఆయన తెలిపారు. మనుషులు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను ఢీకొని ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు పెనగలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బెస్తపల్లె చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు లారీని అడ్డంగా ఆపి కారులో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం మైకంలో ఉన్న నిందితులు స్టేషన్‌కు వచ్చేంతవరకు రభస చేశారని అన్నారు. స్టేషన్‌లో ప్రవేశించిన తర్వాత వర్షిత్‌రెడ్డి స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను, లాప్‌టాప్‌ను ధ్వంసం చేశాడని, స్టేషన్ రైటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

- మట్టి తరలింపులో విభేదాలు

ఒంటిమిట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్‌శాఖ అధికారుల అనుమతితో ఒంటిమిట్ట చెరువులోని మట్టిని కొద్ది రోజులుగా తరలిస్తున్నారు. బుధవారం వారు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణపడ్డారు. సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు... చెరువులోని మట్టిని తరలించుకునే అనుమతుల కోసం బుధవారం ఉదయం కడపలోని ఈఈ కార్యాలయానికి రెండు వర్గాల వారు వెళ్లారు. అక్కడే వాగ్వాదానికి దిగారు. అనంతరం ఒక వర్గంవారు ఒంటిమిట్ట హరిత హోటల్‌లో ఉండగా మరో వర్గం వారు దాడికి ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. హరిత హోటల్ అధికారి సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ ఇరువర్గాలకు చెందిన 14 మందిపై కేసు నమోదు చేసి రెండు వాహనాలు సీజ్ చేశామని తెలిపారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది

- జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్



విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు, అధ్యాపకులు

రాయచోటిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచి విద్యార్థులు ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డైట్ ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై పెయింటింగ్, లింగ సమానత్వంపై వ్యాసరచనలో విద్యార్థులకు ఉమ్మడి కడప జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటి నివారణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లింగ సమానత్వం అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, ఇది అభివృద్ధి చెందుతున్న సమాజానికి పునాది వంటిదన్నారు. లింగ సమానత్వం ద్వారానే సామాజిక పురోగతి సాధ్యమవుతుందన్నారు.

జిల్లా స్థాయి విజేతలు వీరే

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కడప జిల్లాలోని క్లస్టర్ కాంప్లెక్స్ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో బుధవారం డైట్‌లో పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో రాజంపేట మండలం బోయినపల్లి ఎస్‌జేఎస్‌యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వి.మల్లేశ్వరి ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన కె.సుప్రియ ద్వితీయ స్థానం, ఓబులవారిపల్లె మండలం సంజీవపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల విద్యార్థి పి.సూర్య తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే లింగ సమానత్వంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టి.సుండుపల్లె విద్యార్థిని ఎస్.మదిహా ప్రథమ స్థానం, రాజంపేట గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థిని జె.రాధిక ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.తహనీ తృతీయ స్థానం సాధించారు. అలాగే సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక, రాయచోటి మోడల్ స్కూల్ విద్యార్థి ఉదయ్‌కిరణ్‌లు ప్రోత్సాహక బహుమతులు కైవసం చేసుకున్నారు. పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రిన్సిపాల్ తన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను, పతకాలను, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, లెక్చరర్స్ శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, తిరుపతి శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కేదార్నాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదు

గురుకుల పాఠశాల సిబ్బందిపై డీఎల్‌డీవో ఆగ్రహం

తంబళ్లపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో అమర్నాథరెడ్డి ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల అధికారులతో కలసి ఆయన ఎస్టీ బాలుర గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. భోజనం నాణ్యతగా పెడుతున్నారా? మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? అని విద్యార్థులను అడగ్గా భోజనం నాణ్యతగా పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంగనాయకులు అక్కడ లేకపోవడంతో ఫోన్ చేసి పిల్లలకు ఎందుకు భోజనం సరిగ్గా పెట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే వంట గది, స్టోరు రూమును తనిఖీ చేయగా పలు విషయాలు వెలుగుచూశాయి. కొన్ని నెలలుగా పాఠశాలలో ఉన్న రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదని, రెండు రోజుల నుంచి సన్నబియ్యంతో కాకుండా, లావు బియ్యంతో భోజనం వండుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా కొద్దిరోజుల నుంచి కోడిగుడ్లు, చిక్కి, పాలు, పెరుగు ఇవ్వడం లేదని మొత్తం పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టలేదనే విషయాన్ని తెలుసుకున్నారు. వంట నిర్వాహకులను ప్రశ్నించగా ప్రిన్సిపాల్ రెండు రోజుల కిందటి నుంచే లావు బియ్యంతోనే వండమన్నారని వారు సమాధానమిచ్చారు. ఇక నుంచి విద్యార్థులకు మెనూ మేరకు సన్నబియ్యంతో వండిన నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. నిత్యం అధికారులు పాఠశాలను పర్యవేక్షిస్తూ తనిఖీ చేపట్టాలని ఎంఈవోను ఆదేశించారు. అంతకు ముందు ఆయన ప్రభుత్వాస్పత్రిలో సదరం క్యాంపును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో థామస్‌రాజు, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు


కలెక్టర్ శ్రీధర్‌కు దేవుడి ప్రతిమను అందచేస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాయచోటి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను బుధవారం రాయచోటిలోని కలెక్టర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమస్యల గురించి కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రాయచోటి తహసీల్దార్, ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు నరసింహకుమార్, జీవన్ చంద్రశేఖర్, జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉమ్మడి కడప జిల్లాలోని తహసీల్దార్లతో రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కాలేజిలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి, తదితర అంశాలపై చర్చించారు.

సింహ వాహనంలో సిద్దేశ్వరస్వామి

రాజంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక చెన్నకేశవ, సిద్దేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సిద్దేశర్వస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

చదువు కొనసాగించడానికి చక్కటి అవకాశం ఓపెన్ స్కూల్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, తదితరులు

రాయచోటి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు తిరిగి చదువు కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ ఒక చక్కటి అవకాశమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించి సార్వత్రిక విద్యాపీఠం ప్రచార పోస్టర్లను, కరపత్రాలను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి ఫెయిల్ అయిన వారు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి పరీక్ష రాసే ఒక చక్కటి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, 10 ఉత్తీర్ణులైన వారు అతి తక్కువ ఫీజుతో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొంది ఆగిపోయిన చదువులను కొనసాగించుకోవచ్చని తెలిపారు. చదువుకోని వారితో పాటు, చదువు మధ్యలో మానేసిన వారికి విద్యను అందించే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరిన వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, తదితరాలు అభ్యాసకుల ఇంటికి నేరుగా పంపిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలియజేశారు. ఇంటర్నెట్ ఏపీ ఆన్‌లైన్, సమీపంలోని ప్రభుత్వ అనుబంధ విభాగాల ఉన్నత పాఠశాలలు, సచివాలయాల ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చునని జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు తెలియజేశారు. కార్యక్రమంలో అబ్బవరం మధుసూదన్, వీరబల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గించవచ్చు


రైతులకు అవగాహన కల్పిస్తున్న బోదేషావలి

పీలేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు పెట్టుబడి గణనీయంగా తగ్గించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, డీవీఎంసీ సభ్యుడు బోదేషావలి తెలిపారు. కౌన్సిల్ ఫర్ రూరల్ ఎన్‌లైట్మెంట్ (సీఆర్ఈ) సంస్థ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ (ఏపీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో కేవీపల్లె మండలం మంచాలమంద గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని, దిగుబడి తగ్గుతుందన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. రసాయనిక ఎరువుల స్థానంలో జీవన ఎరువులు, క్రిమిసంహారక మందులకు బదులు వేప నూనె కషాయాలను వాడి ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలను పండించగలమన్నారు. సీఆర్ఈ సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ మంచాలమంద, వడ్లకుంట గ్రామాల్లోని రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించి వారి ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు దిగుబడి చేయిస్తామన్నారు. కేవీపల్లె ఏఓ మాధవి మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సీఆర్ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద మాట్లాడుతూ ఏపీఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, అందులోని నియమ నిబంధనలను రైతులకు తెలియజేశారు.

ఏఐతో వైద్య సేవలు సులభం

మదనపల్లె టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో సేవలు సులభంగా సాగుతున్నాయని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ శిల్ప అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఏఐసీటీ ఆధ్వర్యంలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సు మూడో రోజున ఆమె మాట్లాడుతూ ఏఐ సామర్థ్యంతో మనిషిలో దాగి వున్న రోగాన్ని ఖచ్చితత్వంతో గుర్తించవచ్చన్నారు. దీని వలన సమయం, ఖర్చు వృధా కాదన్నారు. బయో ఇన్ఫర్మేటిక్స్ నిపుణురాలు షరన్ అలెగ్జాండర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు వున్న వారికి ఏఐ ద్వారా అతి త్వరగా చికిత్స అందించి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, కోఆర్డినేటర్ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో అన్నా క్యాంటీన్


భూమి పూజ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులు యార్డు నుంచి ఖాళీ కడుపుతో ఇంటికి వెళ్లకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కెట్ యార్డులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు తీసుకొచ్చే రైతులు కడుపు నిండా భోజనం తిని ఇంటికి వెళ్లాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అతి త్వరలోనే భవనాన్ని నిర్మించి అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. బి.కొత్తకోటలో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో హరినారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ'


ఏటీఎం మోడల్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఓబులవారిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్నా జాబితాలో పేర్లు లేని రైతులు రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో వివరాలు సరిదిద్దుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచించారు. బుధవారం చిన్నఓరంపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నోటిఫై చేయబడిన అరటి పంటకు వాతావరణ ఆధారిత బీమా చేసుకునేందుకు ఈనెల 15 ఆఖరు అన్నారు. నెట్‌సెంటర్ల ద్వారా ఎకరాకు 3,062 రూపాయల చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60,400 రూపాయలు బీమా లభిస్తుందని తెలిపారు.

కిసాన్ దీదీ డ్రోన్ పథకంలో 80 శాతం రాయితీతో మండలానికి ఒక యూనిట్ పొందేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలవుతున్న ఏటీఎం మోడల్‌ను సందర్శించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ముక్కావారిపల్లె రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి అన్నదాత సుఖీభవ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో కోడూరు ఏడీఏ మణిసుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి మల్లిక, టెక్నికల్ ఏఓలు రమేష్‌రాజు, శ్రీరాములు రైతుసేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, బుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

వేలంతో రూ.96,500 ఆదాయం

చిన్నమండెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న భూములను మూడేళ్ల పాటు సాగు చేసుకునే హక్కులను బుధవారం 11 గంటలకు వేలం వేసినట్లు ఈవో కొండారెడ్డి తెలిపారు. ఒక్కో సంవత్సరానికి 96,500 రూపాయలు చెల్లించేలా వేలంలో పాల్గొన్న వారు హక్కు పొందారన్నారు.

ఆరోగ్య కేంద్రానికి నిర్లక్ష్యపు జబ్బు

- నిధులు ఫుల్... మందులు నిల్
- వైద్య సేవలు అందక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని వైవీయూ అధికారులు

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రాన్ని నిర్లక్ష్యపు జబ్బు పట్టిపీడిస్తోంది. సమృద్ధిగా నిధులున్నా మందులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. తేలికపాటి జ్వరం వచ్చినా మందులు లేక 20 కిలోమీటర్లు దూరంలో ఉన్న రిమ్స్ హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో వెళ్లాల్సిన దుస్థితి. దీంతో సరైన వైద్యం అందక విద్యార్థులు పడుతున్నారు. దీనిపై వైవీయూ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, పరిశోధన స్కాలర్లు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలకు 24 గంటలు సేవలందించేందుకు 2006లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలం వైద్య సేవలు బాగా కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ సేవలు కుంటుపడ్డాయని చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం రెగ్యులర్ వైస్ చాన్సలర్ ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా చెల్లుబాటు అయింది. దీంతో యదారాజా తదా ప్రజా అన్న చందంగా అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆరోగ్య కేంద్రం నిర్వహణ, అవసరమైన మందుల సేకరణకు ప్రతి నెల యూనివర్సిటీ రూ.50వేలు మంజూరు చేస్తుంది. అయితే ఈ నిధుల వినియోగంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధన స్కాలర్లు, ఉద్యోగులు అందరు కలిపి దాదాపు 3500 మంది వరకు ఉన్నారు. వీరిలో 2000 మంది వరకు విద్యార్థులు క్యాంపస్ హాస్టల్స్‌లో ఉంటున్నారు. వీరికి కనీసం జ్వరం, జలుబు, తలనొప్పి వంటి సీజనల్ వ్యాధులు వచ్చినా వాటికి మందులు లేక అవస్థలు పడుతున్నారు. ఇక యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న మహిళల పరిస్థితి చాలా దయనీయమని చెప్పాలి. ఏ సమస్య వచ్చిన దాదాపు 15కిలోమీటర్లు ప్రయాణించి కడప టౌన్‌కు వచ్చి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్య కేంద్రం మెయింటెనెన్స్‌కు ఏడాదికి రూ. 6 లక్షల బడ్జెట్‌ను యూనివర్సిటీ కేటాయిస్తుంది. అయితే ఈ బడ్జెట్ మొత్తం ఎటువైపు పోతుందో తెలియని పరిస్థితి.



వైవీయూలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కేంద్రంలో లభించాల్సిన సౌకర్యాలు

యూనివర్సిటీ ప్రారంభించినది మొదలుకొని గత టీడీపీ ప్రభుత్వ హయాం వరకు ఆరోగ్య కేంద్రం ఉపయోగకరంగా ఉండేది. ఆరోగ్య కేంద్రంలో ప్రధానంగా సీపీఆర్ ప్యాకెట్ మాస్క్, టోర్నీకెట్, రోలర్, గాజుగుడ్డ, ప్యాడ్లు, మెడికల్ ట్యాప్‌లు, త్రిభుజాకార బ్యాండేజీలు, సామ్ స్ప్రింట్, ఎలాస్టిక్ బ్యాండేజ్, టట్రా మాషియర్స్, యాంటి సెప్టిక్ సొల్యూషన్, యాంటీబయాటిక్ ఆయింట్‌మెంట్, హెచ్2 ఓ2, కాటన్, ఆల్కహాల్ ఆధారిత స్పిరిట్, సెలైన్ మొద లైన అన్ని వస్తువులు ఉండేవి. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవేవీ కూడా అందుబాటులో లేవనే చెప్పాలి. అలాగే కేంద్రంలో క్లినికల్ ల్యాబ్, ఈసీజీ, బయో-కెమికల్ ల్యాబ్ ఉన్నప్పటికీ నిరుపయోగమని చెప్పాలి.



తెరవకుండా ఉన్న ఫార్మసీ గది, మందులు లేని దృశ్యం

జ్వరం బిల్ల కావాలన్నా రిమ్స్‌కే..

విశ్వవిద్యాలయంలో అత్యవసర కేసులకు వైద్యం నిర్వహిం చేలా 2008 నుంచి రిమ్స్‌తో విశ్వవిద్యాలయం ఎంఓయూ చేసుకుంది. అయితే ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో మందు లు లేకపోవడంతో చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా, కనీసం జ్వరం మాత్ర కావాల్సి వచ్చినా యూనివర్సిటీ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి అక్కడ వైద్యం చేయించే పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రానికి బడ్జెట్ ఉన్నప్పటికి ఈ దుస్థితి ఎందుకు ఉన్నదో అధికారులే చెప్పాలి.



ఇ-టెండర్ల ద్వారా మెడిసిన్ కొనుగోలు చేయాలి

ఇ-టెండర్ల ద్వారా మెడిసిన్ కొనుగోలు చేయాలి. అయితే డాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం బడ్జెట్ రూ.80వేలకు పెంచడం జరిగింది. మందులు కొను గోలు చేయాలంటే ఇ-టెండర్ పిలవాల్సిందే. మే, జూన్ నెలలో విద్యార్థులు క్యాంప స్‌లో లేని కారణంగా కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం టెండర్లు పిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలో ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

-ప్రొఫెసర్ పి.పద్మ, రిజిస్ట్రార్, వైవీయూ

మందుల కొనుగోళ్లలో కిరికిరి

ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన మందులు కొనుగోలులో కూడా పెద్ద స్కాం జరిగినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో మెడిసిన్ కొనాలంటే పక్కనే ఉన్న రిమ్స్‌లో కొనుగోలు చేయకుండా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె నుంచి కొనుగోలు చేయడంలో మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తే అసలు నిజం బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

- ఏపీయూడబ్ల్యూజే

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం హేయమైన చర్య అని.. తక్షణమే దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పల్లెటి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ఎక్కంటి ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. బుధవారం బంగారుపాలెం జగన్ పర్యటనలో వైసీపీ మూకల దౌర్జన్యంపై వారు మండిపడ్డారు. యార్డులో జగన్ రైతులతో మాట్లాడే ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై సుమారు పది మంది చుట్టుముట్టి చొక్క చించేసి విచక్షణారహితంగా కొట్టడం చూస్తే వైసీపీ నాయకులకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని అర్థమవుతోందన్నారు. ఉదయం నుంచి తీసిన ప్రోగ్రాం ఫొటోలు ఉండే మెమొరీ కార్డు లాక్కున్నారని తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయంతో దాడి ప్రారంభమైందని... దీనికి బాధ్యులుగా అతనిపై కేసు నమోదు చేయాలన్నారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి చూస్తుండగా దాడి జరగడం వైసీపీ నేతల ప్రోద్బలంతో జరి గిందనడానికి నిదర్శనమన్నారు. తక్షణమే దాడి చేయడానికి ప్రోత్సహించిన వారిని అరెస్టు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కె.బొమ్మేపల్లె డీకేటీ భూములపై విచారణ


రైతులను విచారిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన డీకేటీ భూములపై ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ బుధవారం విచారణ చేపట్టారు. కె.బొమ్మేపల్లె డీకేటీ భూముల్లో భారీగా అవకతవకలు జరిగాయని సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కలెక్టర్, జేసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జేసీ ఆదేశాల మేరకు ఆర్డీవో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి చాలామంది అనర్హులుగా ఉన్నారని, తప్పుడు రికార్డులు సృష్టించి పరిహారం పొందాలని చూస్తున్నారని పలువురు రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఆర్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యపై ఆర్డీవో..

పోరుమామిళ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల మండలంలోని బాలిరెడ్డిపల్లె గ్రామంలో ఇటీవల అప్పుల బాధ తాళలేక బాలక్రిష్ణ అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. బాలాయపల్లె గ్రామాన్ని బుధవారం ఆర్డీవో చంద్రమోహన్ సందర్శించి రైతు ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. బాలక్రిష్ణకు ఎంత మేర పొలం సాగు చేశారు.. అప్పులు ఎన్ని ఉన్నాయి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరాయకొండ - మైదుకూరు నాలుగు లైన్ల జాతీయ రహదారికి సంబంధించి రోడ్డు విస్తరణలో స్థలాలు, భూములు, ఇళ్లు కోల్పోతున్న వారి గురించి విచా రణ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, వ్యవసా యాధికారి చంద్రహాసరెడ్డి పాల్గొన్నారు.

దీర్ఘకాలిక పంటలు సాగు చేయాలి

పోరుమామిళ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలకు బదులు దీర్ఘకాలిక పంటలను సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గురప్పగారిపల్లెలో ఆయిల్‌ఫాం మెగా ప్లాంటేషన్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవన ఆవరణలో ఫామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమం నియోజకవర్గ టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం రంగసముద్రం రైతు సేవా కేంద్రం లో ఉద్యానశాఖ రీఆగ్రో ఇండస్ట్రీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయిల్‌ఫాం సాగు, ప్రభుత్వ ప్రోత్సాహాలు వివరించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు చేపట్టే రైతులకు రూ.29వేల విలువైన మొక్కలను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏరియా ఆఫీసర్ మహేశ్, పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్ యార్డుమాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా క్రీడా పాఠశాల జిల్లాస్థాయి ఎంపికలు


విద్యార్థుల సర్టిఫికెట్స్ పరిశీలిస్తున్న సిబ్బంది, రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్, జులై 9 (ఆంధ్రజ్యోతి): వైయస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి వెల్లడించారు. 4,5 తరగతులలో ప్రవేశానికి సంబంధించి తొలుత బుధవారం 4వ తరగతి ప్రవేశానికి గాను హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించి, అందులో నలుగురిని అనర్హులుగా గుర్తించి తిరస్కరించామన్నారు. మరో 9 మంది సరైన సమయానికి హాజరు కాలేకపోయినట్లు వెల్లడించారు. వీరికి ఈనెల 11న మరో అవకాశం కల్పిస్తామని తెలిపారు. తొలిరోజు ఎంపికలలో పాల్గొన్న అర్హులైన 40 మందిలో 27 మందికి ఎత్తు, బరువు, మెడిసిన్, బాల్‌పుట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, ఫ్లెక్సిబిలిటీ, 6ఇంటు10 షటిల్‌రన్, 30 మీటర్స్ ఫ్లైయింగ్ స్టార్ట్, 600 మీటర్స్ పరుగు పందెం తదితర టెస్ట్‌లు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు సాయి ప్రశాంత్, సతీష్‌కుమార్, స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యమే ఆర్కిటెక్చర్ విద్యార్థులకు శాపం

చెన్నూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆర్కిటెక్చర్ కాలేజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు బుధవారం పొలిట్‌బ్యూరో సభ్యుడు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వల్లనే కాలేజీకి సీవోఏ గుర్తింపు రాలేదన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కళాశాల ఏర్పాటు చేసేటప్పుడే గుర్తింపు ఉండాలన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. పైగా ప్రైవేటు బిల్డింగులలో కాలేజీలు నడుపుతూ నెలకు లక్షల్లో అద్దెలు కడుతున్నారు.. దీనిపై ఇంత వరకు ఎందుకు దృష్టి పెట్టలేద న్నారు. విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేయడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కాగా, తమ సమస్యల పరి ష్కారానికి దీక్ష చేస్తున్న ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల సమస్యలు తెలుసు కొని ఆయన యూనివర్సిటీ ఈసీ విశ్వనాథకుమార్‌తో చర్చించారు.


టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆర్కిటెక్చర్ విద్యార్థులు

ఆధిక్యతలో కర్నూలు, కడప జట్లు

కడప స్పోర్ట్స్, జులై 9 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మల్టీడే క్రికెట్ వేర్వేరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో బుధవారం ప్రత్యర్థి జట్లపై కర్నూలు జట్టు 174 పరుగుల ఆధిక్యత సాధించగా, కడప జట్టు 319 పరుగుల ఆధిక్యత సాధించిచింది. వివరాలిలా..... కేఓఆర్ఎం మైదానంలో కర్నూలు- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెండోరోజు బుధవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 63.4 ఓవర్లలో 251 పరుగులకు కుప్ప కూలింది. కాగా కర్నూలు జట్టు తన రెండవ ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. ఇందులో మురారీ హృదయ్ 60 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టుకు 174 పరుగుల ఆదిక్యతలో నిలిచింది.

ఏసీఏ మైదానంలో కడప- అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 461 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో అర్థిత్‌రెడ్డి 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లలో 250 పరుగులకే చేతు లెత్తేసింది. ఇందులో వీరారెడ్డి 133 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 211 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 74 పరుగులు చేసింది.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూషకుమారి

కడప రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై అవగాహనను పెంపొందించుకొని తద్వారా కేసులను సులువుగా పరిష్కరించుకోవాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తుల(న్యాయవాదులు)కు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, కేస్ స్టడీస్, గ్రూప్ యాక్టివిటీ, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద హ్యాహాలు తదితర అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన అడ్వకేట్, సీనియర్ ట్రైనర్ అనూష సక్సేనా, మధ్యప్రదేశ్‌కు చెందిన అడ్వకే ట్, సీనియర్ ట్రైనర్ మీనా కేర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

36 బ్యాటరీలు చోరీ

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం టిప్పుసుల్తాన్ మైదానంలో నిలిపిన లారీలు, ట్రాక్టర్లు, ఐషర్లు, టిప్పర్ల నుంచి మంగళవారం రాత్రి 36 బ్యాటరీలు చోరీ చేశారు. బుధవారం ఉదయం యాజమానులు గంగాధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మధుకర్‌రెడ్డి, అశోక్‌కుమార్ టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు విచారణ చేపట్టారు. రాత్రి కావడం ఎవరూ లేకపోవడంతో గమనించిన దుండగులు ఈ చోరీకి పాల్పడారన్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌ను బుధవారం రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ తనిఖీ చేశారు. జైళ్ల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. జైళ్లలో నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇందులో జైలర్లు బాధ్యతగా, భద్రత కల్పించాలన్నారు.

గోడౌన్‌లో సరుకు బయటకు పోనివ్వం

- గేటుకు తాళం వేసి లారీలను అడ్డుకున్న రైతులు
- భూపేశ్‌రెడ్డి హామీతో పొగాకు పంట తరలింపు
- మా పరిస్థితి ఏంటి అంటున్న మరికొందరు రైతులు


జీపీఐ కంపెనీ సరకు లారీలు బయటకు వెళ్లకుండా అడ్డుకున్న రైతులు, గోడౌన్‌లోపల నిలిచి వున్న లోడు లారీలు

ముద్దనూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు లోని యశ్వంత్ గోడౌన్ వద్ద మూడు రోజులుగా పెద్దముడియం మండలం సుంకేసుల, ముద్దనూరు మండలం పెద్దదుద్యాల, జమ్మలమడుగు రైతులు జీపీఐ కంపెనీ వారు పొగాకును కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్నారు. అయితే జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అళ్లగడ్డ సమీపంలోని జీపీఐ కంపెనీ వారి గోడౌన్‌లోపొగాకు పంట విక్రయిస్తారని తెలపడంతో పెద్దముడియం మండలం రైతులు బుధవారం పంటను తరలించారు. అయితే మా పరిస్థితి ఏమిటనిముద్దనూరు, జమ్మలమడుగు రైతులు ఆందోళనచెందుతున్నారు. రైతుల సమాచారం మేరకు.. జీపీఐ కంపెనీ వారు రైతులను పొగాకు పంట సాగు కోసం నారు ఇచ్చి, పంట కొనుగోలు చేస్తామని ప్రోత్సహించారు. ముద్దనూరులోని యశ్వంత్ గోడౌన్‌లో ఆ కంపెనీ వారు పొగాకు విక్రయం చేపట్టారు.ఇదే క్రమంలో పెద్దముడియం, ముద్దనూరు, జమ్మలమడుగు రైతులు పొగాకు గోడౌన్ వద్దకు తేగా కంపెనీ వారు విక్రయం లేదన్నారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆందోళన చేపట్టారు. రాత్రింబవళ్లు రైతులు గోడౌన్ వద్దనే కాపలా ఉండి గోడౌన్‌లోని సరుకు తరలించకుండా లారీలను అడ్డుకున్నారు. పంటను కొనుగోలు చేసేంత వరకు వెళ్లేది లేదన్నారు. పంట తీసుకొచ్చిన ట్రాక్టర్లను గోడౌన్ వద్ద ఉంచారు. దీంతో పంట కొనుగోలు చేస్తామని కంపెనీ వారు తెలియజేశారని భూపేష్‌రెడ్డి తెలపడంతో పంటను అళ్లగడ్డకు తరలించారు. అయితే ముద్దనూరు, జమ్మలమడుగు రైతులు మా పరిస్థితి ఏమిటని,స్థానికంగా ఉన్న గోడౌన్‌లోనే తమ పంటను విక్రయించాలని రైతు అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లా స్థాయి చిత్రలేఖనం విజేత మల్లీశ్వరి

రాజంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలం కొత్తబోయనపల్లె ఎస్‌జేఎస్ఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అన్నమయ్య జిల్లా స్థాయిలో చిత్రలేఖనంలో ప్రథమ స్థానంలో నిలవడంతో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు భారతి హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి చదువుతున్న పి.మల్లీశ్వరి అమ్మకు వందనం విభాగంలో బోయనపల్లెలో జరిగిన క్లస్టర్ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. బుధవారం రాయచోటిలో జరిగిన జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రథమ స్థానం సాధించగా జిల్లా విద్యాశాఖాధికారి కె.సుబ్రమణ్యం ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను చిత్రలేఖనం ఉపాధ్యాయుడు దార్ల శ్రీనివాసులు ఆచారితో పాటు ఉపాధ్యాయులు ఓబులేశు, పి.జనార్దన్, పి.శేషగిరి, ఎస్వీ రామరాజు, ఏ.శివప్రసాద్‌గౌడ్, ఎస్.ప్రభాకర్‌రావు, ఎం.చెన్నకేశవులు, పి.విజయభాస్కర్, శ్రీరాములు, అనిల్‌కుమార్, రాజయ్య, అమరావతి, ప్రణవి, సువర్ణ, సుందరి, ప్రశాంత్ అభినందించారు.

ప్రభుత్వ విధానాలతో హక్కులకు విఘాతం

● జిల్లా వ్యాప్తంగా ఉద్యమించిన ప్రజా, కార్మిక సంఘాలు ● ర్యాలీలు, మానవహారాల ఏర్పాటుతో నిరసన



రాజంపేటలో సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాలు

రాజంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం పట్టణంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఐ పలు కార్మిక సంఘాలు అతిథిగృహం నుంచి పాతబస్టాండు వరకు భారీ ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా యూనియన్ల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి కొత్త చట్టాలు తీసుకువచ్చిందని, దీంతో సమస్యలపై పోరాడే హక్కులను కార్మికులుకోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ చట్టాలను రదు చేసేంతవరకు నిరసనలు, ధర్నాలు నిర్వహిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి పి.మహేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి సికిందర్, మున్సిపల్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి పీవీ రమణ, అంగన్వాడీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏవీ రమణడిస్కమ్ అధ్యక్షుడు సుబ్రమణ్యంరాజు, డివిజన్ నాయకులు నగేశ్‌గౌడ్, శ్రీనివాసులరెడ్డి, అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పందుగోల మణి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ ఆధ్వర్యంలో రైల్వేకోడూరులో ర్యాలీ నిర్వహించారు. ఏపీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడు పొలిచర్ల ఓబులేశు, సీఐటీయూ, సీపీఐ, సీపీఎం, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు. మూడు నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు.

మీ సంక్షేమం మా బాధ్యత : చమర్తి


ఇంటింటికి తొలిఅడుగు కార్యక్రమంలో పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి

రాజంపేట టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కార్యకర్తలకు, నేతలకు ఎలాంటి కష్టం వచ్చినా వారి సంక్షేమం కోసం ముందుంటామని పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని డీబీఎన్‌పల్లెలో ఇంటింటికి సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే మా బాధ్యతగా భవిష్యత్‌లో మరింత మెరుగైన పాలన కోసం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ రూరల్ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యనాయుడు, మాజీ టీడీపీ మండల అధ్యక్షులు బాపనయ్యనాయుడు, కొండయ్యనాయుడు, కమ్మసంఘం అధ్యక్షులు శివనారాయణచౌదరి, పోలిచెరువు ప్రెసిడెంట్ నాగినేని నాగేశ్వర్‌నాయుడు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం పరుగులు

రాయచోటిటౌన్: చంద్రబాబు ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు తీస్తున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని 17వ వార్డులో బూత్ ఇన్‌చార్జీలు, టీడీపీ నాయకులతో కలిసి సుపరిపాలనకు తొలి అడుగు- ఇంటింటికి టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. వీరభద్ర స్వామి ఆలయ కమిటీ చైర్మెన్ ఎద్దుల లక్ష్మీప్రసాద్, టీడీపీ నాయకులు షాహుల్ హమీద్, రోషా, రఘు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి : ఎమ్మెల్యే శ్రీధర్

చిట్వేలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ అధికారులకు సూచించారు. బుధవారం టంగుటూరి చంద్ర అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావే శానికి ముఖ్య అతిథులుగా ఖాదీ, గ్రామీణ పరిశ్రమల అభివృద్ధి బోర్డు చైర్మన్ కేకే చౌదరి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుపరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అధికారులు తమ శాఖల అభివృద్ధిని సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కేకే చౌదరి అధికారులకు పలు సూచనలు చేశారు. రాజుకుంట ఎంపీటీసీ సభ్యుడు నాగార్జున పలు సమ్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో సభకు రావాలని అలా రావడం వల్ల సభ్యులకు సమాధానాలు చెప్పడం సులువుగా ఉంటుందని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ, ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యంరెడ్డి, మాజీ మార్కెట్‌కమిటీ రవికుమార్‌రాజు గుత్తి నరసింహ, సీఐ వెంకటేశ్వర్లు, ఏడీఈ బాలాజీ, హెచ్ఎం దుర్గరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతి కార్యదర్శులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడినవారికి అవకాశం కల్పిస్తాం

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు


మాట్లాడుతున్న కస్తూరి విశ్వనాథనాయుడు, పంతగాని నరసింహప్రసాద్, కేకేచౌదరి

చిట్వేలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ ఆవిర్భావం నుంచి కష్టపడిన వారికి తెలుగుదేశంపార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాదనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో మండలంలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలతో సమావేశ మయ్యారు. రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ , రాష్ట్ర ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీ చైర్మన్ కేకే చౌదరి, పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు హాజరయ్యారు. ఈ సంద ర్భంగా సమావేశానికి విచ్చేసిన పలువురు మాట్లాడుతూ అధికారంలో లేనప్పుడు కష్టనష్టాలను ఓర్చుకుంటూ పని చేసిన వారికి గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడిగా కాకర్ల నాగార్జుననాయుడును నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రామాంజుల నాయుడు, కాకర్ల సుబ్బరాయుడు, దుగ్గిన ఈశ్వరయ్య, కట్టా లోకేష్, బుంగటావుల రాజశేఖర్, న్యాయవాది బాలాజీ, కొండా వెంకటేష్, జయప్రకాష్, అనంతయ్య యా దవ్, రమణయాదవ్, చక్రవర్తుల వెంకటే ష్‌రాజు, బాలక్రిష్ణయాదవ్, వెంకటయ్య, శంకర్‌యాదవ్, పెంచలరెడ్డి, శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే కొండంత బలం

సిద్దవటం : తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే కొండంత బలమని, టీడీపీ మండల పరిశీలకుడు పులేల రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని పార్వతీపురం గ్రామంలో బుధవారం నిర్వ హించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విభేదాలు పక్కనబెట్టి పార్టీ కోసం కృషి చేయాలని తెలిపారు. రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరి కుప్పాల వెంకటసుబ్బయ్య, మండల టీడీపీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి, దశరథరాయుడు పాల్గొన్నారు.

వేరుశనగకు విత్తనశుద్ధి అవసరం


రైతులతో మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి కిశోర్‌నాయక్

సంబేపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగు చేసే రైతులు విత్తనశుద్ధి చేసువాలని ఏవో కిశోర్ నాయక్ సూచించారు. బుధవారం గున్నికుంట్ల, గురిగింజకుంట గ్రామాల్లో పొలం పిలుస్తోం ది కా ర్య క్ర మం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగలో విత్తనశుద్ధితో వేరు సంబంధిత వ్యాధులు దరిచేరవన్నారు. ఒక కేజీ విత్తనాలకు ఒక గ్రాము కార్బెండజిం కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ జాబితాలోని రైతుల వివరాలను తెలియజేశారు. అర్హులైన రైతులు జాబితాలో పేర్లు లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి వెంకట్రమణ, గ్రామ వ్యవసాయ అధికారి శ్రీకర్, గ్రామ హార్టికల్చర్ అధికారి మన్మయి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంఎస్ స్కీం టెండర్లలో అవినీతిపై విచారణ

సిద్దవటం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఎంఎస్ స్కీం టెండర్లలో అవకతవకలు జరిగాయంటూ టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు జేసీ అదితిసింగ్‌కు జూలై 7న ఫిర్యాదు చేయడంతో, మాధవరం సచివాలయం-2లో బుధవారం అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఏడుకొండలు మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ పంపింగ్ స్కీం టెండరులో అక్రమాలు జరిగాయని, జేసీకి ఫిర్యాదు చేయడంతో విచారణ చేస్తున్నామన్నారు. సిద్దవటం పెన్నానది నుంచి పుష్కలంగా తాగునీరు అందిస్తున్నామని, గ్రామంలో ఉండే ట్యాంకులకు కూడా తాగునీరు అందుతోందన్నారు. కొన్ని గ్రామాల్లో చిన్న చిన్న సమస్యల కారణంగా తాగునీరు అందడం లేదన్న విషయం వాస్తవమేనన్నారు. అలాంటి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి ప్రజలకు తాగునీరు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఎస్‌కేఆర్‌నగర్, ఆలీనగర్, వెంకటేశ్వరపురం, బంగారుపేట ప్రాంతాల్లో నివశించే ప్రజలకు తాగునీరు అందలేదని ఫిర్యాదులు అందాయని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ కిరణ్‌కుమార్, ఏఈ గురుప్రసాద్, సర్పంచ్ జానకిరామయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగపు అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, సెక్రటరి లక్ష్మీనరసయ్య, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం విజయవంతం చేద్దాం


సుండుపల్లె: విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఎంఈవో

రామాపురం, జూలై9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో జూలై 10న నిర్వహించనున్న మెగా సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాల్గొని విజయవంతం చేయాలని ప్రగతి శీల ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశం పాఠశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య బంధాన్ని బలోపేతం చేసేందుకు కీలక వేదికగా ఉంటుందన్నారు. విద్యార్థి వికాసానికి, సమస్యల పరిష్కారానికి దిక్సూచిగా నిలుస్తుందన్నారు. విద్యార్థుల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య ఓ ఆత్మీయ వారధిని నిర్మిస్తుందని, దేశంలోనే తొలిసారిగా రాష్ట్రమంతా ఒకేసారి తల్లిదండ్రుల సమావేశం పండుగ వాతావరణంలో నిర్వహించాలని కోరారు.

సుండుపల్లె: తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. బుధవారం ఇంటింటికి వెళ్లి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆహ్వానం పలికారు. ఆడపిల్లల ఉన్నత చదువు, వెనుక బడిన డ్రాపౌట్ విద్యార్థులను బడుల్లో చేర్పించేలా అవగాహన కల్పిస్తామన్నారు.

అంగన్వాడీ కేంద్రాలతనిఖీ

పెనగలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని సాతుపల్లె, ఇండ్లూరు-2, సాతుపల్లె హరిజన వాడ అంగన్వాడీ కేంద్రాలను బుధవారం సీడీపీవో నిర్మలజ్యోతి తనిఖీ చేశారు. బుధవారం అందించిన ఆహారం గురించి చిన్నా రులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాల్లోని రికార్డులను, ఆహార నిల్వలను తనిఖీ చేశారు

'సంక్షేమం'పై అవగాహన కల్పించండి


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో జేడీఏ చంద్రనాయక్

సిద్దవటం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని జేడీఏ బి.చంద్రనాయక్ సూచించారు. సిద్దవటం మండలంలోని రాజుపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మండలానికి 80 శాతం సబ్సిడీపై ఒకటి చొప్పున కిసాన్ డ్రోన్ మంజూరు చేస్తున్నామని, ఆసక్తి గల రైతులు మండల వ్యవసాయశాఖ అధికారి, రైతుసేవా కేంద్రంలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలన్నారు. రైతులు అన్నదాత సుఖీభవ పథకం లబ్ది పొందాలంటే ఫార్మర్ ఈకేవైసీ తప్పని సరిగా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవ సాయ శాఖ విస్తరణాధికారులు రమేష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు మురళీ, శివకుమార్, రైతులు పాల్గొన్నారు.

17 వేల మొక్కలు పంపిణీ చేశాం: ఎఫ్ఆర్వో

సిద్దవటం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం సందర్భంగా పంపిణీ చేసేందుకు జిల్లా వ్యాప్తంగా విద్యాశాఖాధికారులకు 17 వేల మొక్కలు పంపిణీ చేశామని కడప ఫారెస్ట్ రేంజ్ అధికారి ప్రసాద్ తెలిపారు. సిద్దవటం మండలంలోని జేఎంజే కళాశాల సమీపాన ఉన్న రాజీవ్‌స్మృతి వనం నర్సరీ నుంచి సేకరించిన మొక్కలను ఉమ్మడి కడపజిల్లా లోని విద్యాశాఖ, మున్సిపాలిటి అధికారులకు పంపిణీ చేశామని తెలిపారు. గురువారం పేరెంట్స్‌డే సందర్భంగా ప్రతి పాఠశాలలో ఈ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాదిహామీ సిబ్బంది రాజు, వేణు, ఓబుల్‌రెడ్డి, శిరీషా సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

లక్కిరెడ్డిపల్లె, జూలై9(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ నీలోఫర్ బేగం క్షయ వ్యాధి బాధితులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ అవకాశాన్ని బాధితులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌లు సులోచన, భరత్ కీర్తి, హెడ్ నర్స్ ప్రమీల, టీబీ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

'హైవే నిర్వాసితులకు న్యాయం చేస్తాం'


ఎన్‌హెచ్ అధికారులు, నిర్వాసితులతో మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారికి ఇరు వైపులా ఇళ్లు, స్థలాలు కోల్పోయిన వారికి తగిన న్యాయం జరిగేట్లు చూస్తామని రాయచోటి టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని ఇళ్లు కోల్పోయిన వారు, ఎన్‌హెచ్ఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎస్ అధికారులు ఇచ్చిన కొలతల కన్నా ఎక్కువ ఇళ్లు కూలగొడుతున్నారని దీనికి తోడు తగినంత నష్టపరిహారం ఇవ్వలేదని కొందరు, అసలు పరిహారమే అందలేదని కొందరు వాపోయారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, అందరికీ పరిహారం అందేటట్లు చూస్తామని లక్ష్మీప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు.

'పసల్ బీమా'తో రైతుకు లాభం

గాలివీడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి పసల్ బీమా, వాతావరణ బీమా పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ జయరాణి కోరారు. మండలంలోని గాలివీడులో బుధవారం ఆమె పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసల్ బీమా, వాతావరణ బీమా కింద వేరుశనగ, వరి, కంది, టమోటా, అరటి పంటలకు ఇన్సూరెన్స్ చేసుకోవచ్చునని తెలిపారు. ఏవో గౌతమి, ఏఈవో మణి, వీఏవో మహమ్మద్‌అలీ, వీ:హెచ్‌ఏ శివ, లలిత తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథుడి సన్నిధిలో ఎంపీ, ఎమ్మెల్యే

నందలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల సందర్భంగా సౌమ్యనాథస్వామిని బుధవారం రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు. అర్చకులు పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. స్వామివారికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి పూలమాల, శాలువాతో సత్కరించారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, సౌమ్యనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యాన్ని పరిరక్షించండి

ఓబులవారిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గాదెల గ్రామ పంచాయతీలో చెత్త సేకరణను ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి తడిచెత్త, పొడిచెత్త వేర్వేరు డబ్బాల్లో సేకరించాలన్నారు. మురుగునీరు, చెత్త కారణంగా దోమలు వ్యాప్తి చెంది రోగాలు ప్రబలే అవకాశం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా చెత్తసేకరణ చేసి చెత్తసంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు.

అతివేగం ప్రమాదకరం

సిద్దవటం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : డీజిల్, పెట్రోలు రవాణా వాహనాల డ్రైవర్లు గంటకు 60 కిలోమీటర్లకన్నా ఎక్కువ వేగంతో వాహనాలు నడపరాదని హిందూస్థాన్ పెట్రోలియం సంస్థ డీఎం సతీష్‌కుమార్ సూచించారు. బాకరాపేట సమీపాన ఉన్న తీ సంస్థ ప్రాంగణంలో బుధవారం ట్యాంకర్ల డ్రైవర్లకు అవగాహన కల్పించారు.ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, పోలీసులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మాతంగ మహాపీఠంలో చాతుర్మాస దీక్ష

లక్కిరెడ్డిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్రిచెరువు సమీపంలోని మాతంగ మహాపీఠం ప్రాంగణంలో నేటి నుంచి 10వ తేదీ నుంచి చాతుర్మాస దీక్షలు ప్రారంభమవుతున్నట్లు ధర్మాధికారి డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన, ప్రతిరోజు పూజా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు

రైతు సేవా కేంద్రాల్లో లబ్ధిదారుల జాబితా..

లక్కిరెడ్డిపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ లబ్దిదారుల జాబితా ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించాలని లక్కిరెడ్డిపల్లె వ్యవసాయాధికారి రాజకుమారి సూచించారు. బుధ వారం కుర్నూతల, పందిళ్లపల్లెల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ పేర్లల్లో తప్పొప్పులు సరిచూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే రైతు సేవా కేంద్రంలోని వ్యవ సాయ అధికారులను సంప్రదించాలన్నారు. అర్హులైన రైతులు వెంటనే ఆధార్, భూమి పట్టా, పాస్ పుస్తకం జిరాక్స్ తీసుకుని రైతు సేవా కేంద్రంలో అప్పగించాలన్నారు. వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు నానో డీఏ, నానో యూరియా , ఉపయోగాలు, వినియోగించే విధానం వివరించారు.

రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు మోక్షం!

● కదులుతున్న ఫైలు
● ప్రభుత్వానికి నివేదిక అందించిన అధికారులు
● అటవీశాఖ అనుమతి, రోడ్డు కనెక్టివిటీ కోసం ఫైల్ సిద్ధం


గతంలో ఎస్ఆర్ కాలనీ వరకు వేసిన రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు

రైల్వేకోడూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు కూటమి ప్రభుత్వంలో మోక్షం వచ్చింది. ఆర్అండ్‌బీ అధికారులు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించారు. అటవీశాఖ అనుమతి, రోడ్డు కనెక్టివిటీ తదితర వాటి కోసం అధికారులు ఫైలు సిద్ధం చేశారు. భూసేకరణ కోసం అయ్యే ఖర్చు కూడా లెక్కలు వేశారు. 35 హెక్టార్ల వరకు భూసేకరణ చేయాల్సి వస్తుందని అంచనాలు వేశారు. రోడ్డు నిర్మాణాలు, కల్వర్టులు, బ్రిడ్జిలు, టర్నింగ్ పాయింట్లు తదితర వాటి కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నివేదికలు తయారు చేస్తామని ఆర్అండ్‌బీ శాఖాధికారులు చెబుతున్నారు. 30 ఏళ్లుగా రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు పెండింగ్‌లో ఉంది. ఇందుకు సంబంధించిన ఫైలు బుట్టదాఖలైంది. గత కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వంలో రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు మంజూరు చేస్తామని హామీలు ఇచ్చిన పాలకులు తర్వాత దాని గురించే మరిచిపోయారు. గత ఏడాది ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే రోడ్డు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల దృష్టికి కోడూరు ఎమ్మెల్యే, విప్ అరవ శ్రీధర్, కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డిలు స్వయంగా కలసి విన్నవించారు. దీంతో మూడు నెలల క్రితం ఎమ్మెల్యే తో పాటు ఆర్అండ్‌బీ అధికారులు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డును పరిశీలించారు. తర్వాత ఆర్అండ్‌బీ శాఖాధికారులు ఇందుకు సంబంధించిన ఫైలును సిద్ధం చేసి నివేదికను ప్రభుత్వానికి పంపారు. రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుకు సంబంధించిన భూసర్వే చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా 30 ఏళ్ల క్రిందట రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు ప్రతిపాదనలు చేసి రైల్వేకోడూరు మార్కెట్ యార్డు నుంచి కేఆర్ కండ్రిక గ్రామం పరిధిలోని ఎస్ఆర్ కాలనీ వరకు 8.9 కిలోమీటర్ల దూరం వరకు తారు రోడ్డు నిర్మించారు. అటువైపు వెంకటగిరి నుంచి లాలాపేట అటవీ సరిహద్దు వరకు 6.3 కిలోమీటర్ల దూరం వరకు తారు రోడ్డు నిర్మాణం చేశారు. మధ్యలో అడవి ఉండడంతో


అడవి మధ్యలో ఎరుపు రంగులో కనిపిస్తున్నదే రోడ్డు మార్గం

అటవీశాఖ అనుమతులు అప్పట్లో రాకపోవడంతో ఈ రోడ్డు పెండింగ్‌లో పడి పోయింది. అప్పటి నుంచి పాలకులు ఈ రోడ్డుకు అటవీశాఖ అనుమతులు తెచ్చుకోకపోవడంతో ఈ ఫైలు మరుగున పడిపోయింది. కూటమి ప్రభుత్వం రాగానే ఈ రోడ్డు ఫైలుకు కదలిక వచ్చింది. ఎమ్మెల్యేతో పాటు పార్టీ ఇన్‌చార్జ్ ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎంలతో కలిసి ఈ రోడ్డు విషయమై చర్చించారు. దీంతో వారి నుంచి సానుకూలమైన స్పందన రావడం, ఫైలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపడం ద్వారా కదలిక వచ్చింది. ఈ రోడ్డు ప్రారంభమైతే రైల్వేకోడూరు నుంచి వెంకటగిరికి 41 కిలోమీటర్లే. గంటలో వెంకటగిరి చేరుకోవచ్చు. ఇటు వ్యాపారం, అటు మానవ సంబంధాలు పెరుగుతాయి. అదే రైల్వేకోడూరు, రేణిగుంట, ఏర్పేడు మీదుగా వెంకటగిరికి వెళ్లాలంటే 83 కిలోమీటర్ల దూరం వస్తుంది. అదేవిధంగా రైల్వేకోడూరు, చిట్వేలి, రాపూరు మీదుగా వెంకటగిరికి వెళ్లాలంటే 85 కిలోమీటర్ల దూరం వస్తుంది. అందులోను ప్రయాణ గంటలు పెరగడమే కాకుండా వ్యయప్రయాసలు పెరుగుతాయి. రైల్వేకోడూరు నుంచి కొండల మధ్య నుంచి వెళితే ప్రయాణ గంటలు తగ్గడమే కాకుండా వెంకటగిరి నుంచి నెల్లూరు తదితర ప్రాంతాలకు సులువుగా వెళ్లేందుకు బాగుంటుంది. విజయవాడకు ప్రయాణించే వారు రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు మీదుగా వెళితే దూరం తగ్గనుంది. వెంకటగిరిలో చీరలు, అరటి కాయలు, బొప్పాయి, మామిడి వ్యాపారం చేసుకునేందుకు వ్యాపారులకు అనువుగా ఉంటుంది. త్వరలోనే రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు భూసర్వే కోసం అనుమతి వస్తుందని, సర్వే పూర్తి కాగానే అటవీశాఖ అనుమతి, తర్వాత బ్రిడ్జిలు, కల్వర్టులు, మెటల్ వర్క్, తారు రోడ్డు తదితర వాటిపై అధికారులు నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపితే ప్రభుత్వం నిర్మాణ వ్యయ అంచనాలు వేసి నిధులు మంజూరు చేస్తుంది. ఆ తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభమవుతాయని రైల్వేకోడూరు ఆర్అండ్‌బీ శాఖ డీఈ జయప్రసాద్ వివరించారు.


రోడ్డు తనిఖీ చేసి అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ (ఫైల్)

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గించవచ్చు


రైతులకు అవగాహన కల్పిస్తున్న బోదేషావలి

పీలేరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు పెట్టుబడి గణనీయంగా తగ్గించవచ్చని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు, డీవీఎంసీ సభ్యుడు బోదేషావలి తెలిపారు. కౌన్సిల్ ఫర్ రూరల్ ఎన్‌లైట్మెంట్ (సీఆర్ఈ) సంస్థ, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ (ఏపీఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో కేవీపల్లె మండలం మంచాలమంద గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ఇచ్చిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందని, దిగుబడి తగ్గుతుందన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. రసాయనిక ఎరువుల స్థానంలో జీవన ఎరువులు, క్రిమిసంహారక మందులకు బదులు వేప నూనె కషాయాలను వాడి ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా ఆరోగ్యకరమైన పంటలను పండించగలమన్నారు. సీఆర్ఈ సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ మంచాలమంద, వడ్లకుంట గ్రామాల్లోని రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి వారికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించి వారి ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు దిగుబడి చేయిస్తామన్నారు. కేవీపల్లె ఏఓ మాధవి మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. సీఆర్ఈ సంస్థ ప్రధాన కార్యదర్శి ప్రహల్లాద మాట్లాడుతూ ఏపీఎఫ్ ద్వారా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, అందులోని నియమ నిబంధనలను రైతులకు తెలియజేశారు.

ఏఐతో వైద్య సేవలు సులభం

మదనపల్లె టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో వైద్యరంగంలో సేవలు సులభంగా సాగుతున్నాయని ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ శిల్ప అన్నారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఏఐసీటీ ఆధ్వర్యంలో అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సదస్సు మూడో రోజున ఆమె మాట్లాడుతూ ఏఐ సామర్థ్యంతో మనిషిలో దాగి వున్న రోగాన్ని ఖచ్చితత్వంతో గుర్తించవచ్చన్నారు. దీని వలన సమయం, ఖర్చు వృధా కాదన్నారు. బయో ఇన్ఫర్మేటిక్స్ నిపుణురాలు షరన్ అలెగ్జాండర్ మాట్లాడుతూ క్యాన్సర్ లక్షణాలు వున్న వారికి ఏఐ ద్వారా అతి త్వరగా చికిత్స అందించి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, కోఆర్డినేటర్ కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో అన్నా క్యాంటీన్


భూమి పూజ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): టమోటా రైతులు యార్డు నుంచి ఖాళీ కడుపుతో ఇంటికి వెళ్లకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్కెట్ యార్డులో అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆయన మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద టమోటా మార్కెట్‌గా పేరొందిన ములకలచెరువు మార్కెట్‌కు టమోటాలు తీసుకొచ్చే రైతులు కడుపు నిండా బోజనం తిని ఇంటికి వెళ్లాలనే లక్ష్యంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అతి త్వరలోనే భవనాన్ని నిర్మించి అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. బి.కొత్తకోటలో కూడా అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, ఎంపీడీవో హరినారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, యర్రగుడి సురేష్, కేవీ రమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ'


ఏటీఎం మోడల్ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

ఓబులవారిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉన్నా జాబితాలో పేర్లు లేని రైతులు రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఆన్‌లైన్‌లో వివరాలు సరిదిద్దుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ సూచించారు. బుధవారం చిన్నఓరంపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నోటిఫై చేయబడిన అరటి పంటకు వాతావరణ ఆధారిత బీమా చేసుకునేందుకు ఈనెల 15 ఆఖరు అన్నారు. నెట్‌సెంటర్ల ద్వారా ఎకరాకు 3,062 రూపాయల చొప్పున ప్రీమియం చెల్లిస్తే 60,400 రూపాయలు బీమా లభిస్తుందని తెలిపారు.

కిసాన్ దీదీ డ్రోన్ పథకంలో 80 శాతం రాయితీతో మండలానికి ఒక యూనిట్ పొందేందుకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ ద్వారా అమలవుతున్న ఏటీఎం మోడల్‌ను సందర్శించారు. రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని ప్రోత్సహించారు. అనంతరం ముక్కావారిపల్లె రైతుసేవా కేంద్రాన్ని సందర్శించి అన్నదాత సుఖీభవ జాబితాను పరిశీలించారు. కార్యక్రమంలో కోడూరు ఏడీఏ మణిసుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి మల్లిక, టెక్నికల్ ఏఓలు రమేష్‌రాజు, శ్రీరాములు రైతుసేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, బుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

వేలంతో రూ.96,500 ఆదాయం

చిన్నమండెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీలోని మండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సంబంధించి ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న భూములను మూడేళ్ల పాటు సాగు చేసుకునే హక్కులను బుధవారం 11 గంటలకు వేలం వేసినట్లు ఈవో కొండారెడ్డి తెలిపారు. ఒక్కో సంవత్సరానికి 96,500 రూపాయలు చెల్లించేలా వేలంలో పాల్గొన్న వారు హక్కు పొందారన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో చోరీ


చిందరవందరగా పడేసిన వస్తువులు

లక్కిరెడ్డిపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులందరూ పొలం పనులకు వెళ్లిన సమయంలో దొంగలు తలుపులకు వేసిన తాళం పగులగొట్టి నగలు, నగదు అపహరించుకు వెళ్లారు. బాధితుల కథనం మేరకు మోటారుకు మరమ్మతులు చేస్తుండడంతో మండలంలోని కోనంపేటకు చెందిన కొర్లకుంట రామచంద్రయ్య కుటుంబ సభ్యులందరూ బుధవారం తలుపులకు తాళం వేసి పొలం వద్దకు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు గడ్డపారతో తాళం పగలగొట్టి లోపలికి వెళ్లి బీరువాలో దాచిన లక్ష రూపాయలు నగదు, బంగారు నగలు అపహరించికుపోయినట్లు బాధితుడు తెలిపారు. ఎస్ఐ రవీంద్రబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'కష్టపడి చదవండి'


అన్నాన్ని పరిశీలిస్తున్న సురేశ్‌కుమార్

సుండుపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులు కష్టపడి చదవాలని జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి, సుండుపల్లె మండల ప్రత్యేక అధికారి సురేశ్ కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రానికి సమీపంలోని పుల్లారెడ్డిగారిపల్లె గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగదిని పరిశీలించారు. అన్నం, కూరలు నాణ్యతగా చేసి విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం పాఠశాలలోని స్టోర్‌రూమ్, డార్మిటరీ, టాయిలెట్స్, గార్డెన్, తరగతి గదులను పరిశీలించారు. రాత్రిపూట గదుల నుంచి బయటికి రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కష్టపడి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కాంపౌండ్ వాల్ లేకపోవడం వలన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనలపై కేసు నమోదు

పెనగలూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వేర్వేరు చోట్ల మంగళవారం రాత్రి జరిగిన సంఘటనలపై కేసు నమోదు చేసి నిందితులను కోర్టుకు హాజరుపరిచినట్లు పెనగలూరు ఎస్ఐ రవిప్రకాష్‌రెడ్డి తెలిపారు. రాజంపేట పట్టణంలో స్థిరపడిన శివశంకర్‌రెడ్డి, ఆయన కుమారుడు వర్షిత్‌రెడ్డి మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో నెల్లూరు నుంచి రాజంపేటకు వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న కారు జగ్గంపేటలో స్కూటీపై వెళుతున్నవారిని ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. మరికొంత దూరం వెళ్లిన తర్వాత ఆటోను ఢీకొనడంతో నలుగురు వ్యక్తులకు గాయాలయ్యాయని ఆయన తెలిపారు. మనుషులు ప్రయాణిస్తున్న రెండు వాహనాలను ఢీకొని ఆపకుండా వెళుతుండడంతో స్థానికులు పెనగలూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు బెస్తపల్లె చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు లారీని అడ్డంగా ఆపి కారులో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. మద్యం మైకంలో ఉన్న నిందితులు స్టేషన్‌కు వచ్చేంతవరకు రభస చేశారని అన్నారు. స్టేషన్‌లో ప్రవేశించిన తర్వాత వర్షిత్‌రెడ్డి స్టేషన్‌లోని ఫర్నిచర్‌ను, లాప్‌టాప్‌ను ధ్వంసం చేశాడని, స్టేషన్ రైటర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

తెలుగు తమ్ముళ్ల బాహాబాహీ

● మట్టి తరలింపులో విభేదాలు

ఒంటిమిట్ట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్‌శాఖ అధికారుల అనుమతితో ఒంటిమిట్ట చెరువులోని మట్టిని కొద్ది రోజులుగా తరలిస్తున్నారు. బుధవారం వారు రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణపడ్డారు. సీఐ బాబు తెలిపిన వివరాల మేరకు... చెరువులోని మట్టిని తరలించుకునే అనుమతుల కోసం బుధవారం ఉదయం కడపలోని ఈఈ కార్యాలయానికి రెండు వర్గాల వారు వెళ్లారు. అక్కడే వాగ్వాదానికి దిగారు. అనంతరం ఒక వర్గంవారు ఒంటిమిట్ట హరిత హోటల్‌లో ఉండగా మరో వర్గం వారు దాడికి ప్రయత్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. హరిత హోటల్ అధికారి సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాల వారిని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ ఇరువర్గాలకు చెందిన 14 మందిపై కేసు నమోదు చేసి రెండు వాహనాలు సీజ్ చేశామని తెలిపారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది

● జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్



విజేతలతో డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌కుమార్‌బాబు, అధ్యాపకులు

రాయచోటిటౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): చిన్ననాటి నుంచి విద్యార్థులు ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని డైట్ ప్రిన్సిపాల్ ఎంఆర్ఎస్ అజయ్‌కుమార్‌బాబు అన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని డైట్‌లో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై పెయింటింగ్, లింగ సమానత్వంపై వ్యాసరచనలో విద్యార్థులకు ఉమ్మడి కడప జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటి నివారణకు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. లింగ సమానత్వం అనేది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని, ఇది అభివృద్ధి చెందుతున్న సమాజానికి పునాది వంటిదన్నారు. లింగ సమానత్వం ద్వారానే సామాజిక పురోగతి సాధ్యమవుతుందన్నారు.

జిల్లా స్థాయి విజేతలు వీరే

ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి కడప జిల్లాలోని క్లస్టర్ కాంప్లెక్స్ స్థాయిలో విజేతలైన విద్యార్థులకు జిల్లా స్థాయిలో బుధవారం డైట్‌లో పెయింటింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై నిర్వహించిన పెయింటింగ్ పోటీల్లో రాజంపేట మండలం బోయినపల్లి ఎస్‌జేఎస్‌యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పి.మల్లేశ్వరి ప్రథమ స్థానం, అదే పాఠశాలకు చెందిన కె.సుప్రియ ద్వితీయ స్థానం, ఓబులవారిపల్లె మండలం సంజీవపురం ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాల విద్యార్థి పి.సూర్య తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే లింగ సమానత్వంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టి.సుండుపల్లె విద్యార్థిని ఎస్.మదిహ ప్రథమ స్థానం, రాజంపేట గవర్నమెంట్ హైస్కూల్ విద్యార్థిని జె.రాధిక ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎస్.తహనీ తృతీయ స్థానం సాధించారు. అలాగే సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని మౌనిక, రాయచోటి మోడల్ స్కూల్ విద్యార్థి ఉదయ్‌కిరణ్‌లు ప్రోత్సాహక బహుమతులు కైవసం చేసుకున్నారు. పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రిన్సిపాల్ తన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను, పతకాలను, నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డైట్ సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి, లెక్చరర్స్ శివభాస్కర్, వైసీ రెడ్డెప్పరెడ్డి, తిరుపతి శ్రీనివాసులు, మోహన్‌నాయక్, కేదార్నాధ్, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదు

గురుకుల పాఠశాల సిబ్బందిపై డీఎల్‌డీవో ఆగ్రహం

తంబళ్లపల్లె, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఎందుకు పెట్టడం లేదని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో అమర్నాథరెడ్డి ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల అధికారులతో కలసి ఆయన ఎస్టీ బాలుర గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏడాదికేడాది విద్యార్థుల సంఖ్య తగ్గుతుండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. భోజనం నాణ్యతగా పెడుతున్నారా.? మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా.? అని విద్యార్థులను అడగ్గా భోజనం నాణ్యతగా పెట్టడం లేదని ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంగనాయకులు అక్కడ లేకపోవడంతో ఫోన్ చేసి పిల్లలకు ఎందుకు భోజనం సరిగ్గా పెట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే వంట గది, స్టోరు రూమును తనిఖీ చేయగా పలు విషయాలు వెలుగుచూశాయి. కొన్ని నెలలుగా పాఠశాలలో ఉన్న రెండు ఆర్వో వాటర్ ప్లాంట్లు పనిచేయడం లేదని, రెండు రోజుల నుంచి సన్నబియ్యంతో కాకుండా, లావు బియ్యంతో భోజనం వండుతున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా కొద్దిరోజుల నుంచి కోడిగుడ్లు, చిక్కి, పాలు, పెరుగు ఇవ్వడం లేదని మొత్తం పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెట్టలేదనే విషయాన్ని తెలుసుకున్నారు. వంట నిర్వాహకులను ప్రశ్నించగా ప్రిన్సిపాల్ రెండు రోజుల కిందటి నుంచే లావు బియ్యంతోనే వండమన్నారని వారు సమాధానమిచ్చారు. ఇక నుంచి విద్యార్థులకు మెనూ మేరకు సన్నబియ్యంతో వండిన నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని ఆదేశించారు. నిత్యం అధికారులు పాఠశాలను పర్యవేక్షిస్తూ తనిఖీ చేపట్టాలని ఎంఈవోను ఆదేశించారు. అంతకు ముందు ఆయన ప్రభుత్వాస్పత్రిలో సదరం క్యాంపును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో థామస్‌రాజు, ఎంఈఓ త్యాగరాజు, ఏపీఓ అంజనప్ప, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఏపీ జేఏసీ చైర్మన్ బొప్పరాజు


కలెక్టర్ శ్రీధర్‌కు దేవుడి ప్రతిమను అందచేస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

రాయచోటి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను బుధవారం రాయచోటిలోని కలెక్టర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది సమస్యల గురించి కలెక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, రాయచోటి తహసీల్దార్, ఏపీఆర్ఎస్ఏ అధ్యక్షుడు నరసింహకుమార్, జీవన్ చంద్రశేఖర్, జిల్లాలోని తహసీల్దార్లు పాల్గొన్నారు.

అనంతరం బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉమ్మడి కడప జిల్లాలోని తహసీల్దార్లతో రాయచోటిలోని సాయి ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలను ఏ విధంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి, తదితర అంశాలపై చర్చించారు.

సింహ వాహనంలో సిద్ధేశ్వరస్వామి

రాజంపేట, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తాళ్లపాక చెన్నకేశవ, సిద్ధేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం సిద్ధేశర్వస్వామి సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

చదువు కొనసాగించడానికి చక్కటి అవకాశం ఓపెన్ స్కూల్

● కలెక్టర్ చామకూరి శ్రీధర్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్, తదితరులు

రాయచోటి టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యలో బడి మానేసిన విద్యార్థులకు తిరిగి చదువు కొనసాగించడానికి ఓపెన్ స్కూల్ ఒక చక్కటి అవకాశమని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు సంబంధించి సార్వత్రిక విద్యాపీఠం ప్రచార పోస్టర్లను, కరపత్రాలను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పెయిల్ అయిన వారు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదో తరగతి పరీక్ష రాసే ఒక చక్కటి అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, 10 ఉత్తీర్ణులైన వారు అతి తక్కువ ఫీజుతో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొంది ఆగిపోయిన చదువులను కొనసాగించుకోవచ్చని తెలిపారు. చదువుకోని వారితో పాటు, చదువు మధ్యలో మానేసిన వారికి విద్యను అందించే సార్వత్రిక విద్యాపీఠంలో ప్రవేశాల సంఖ్యను పెంచాలని అధికారులను ఆదేశించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో చేరిన వారికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు, తదితరాలు అభ్యాసకుల ఇంటికి నేరుగా పంపిస్తారని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలియజేశారు. ఇంటర్నెట్ ఏపీ ఆన్‌లైన్, సమీపంలోని ప్రభుత్వ అనుబంధ విభాగాల ఉన్నత పాఠశాలలు, సచివాలయాల ద్వారా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈనెల 30వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చునని జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరాజు తెలియజేశారు. కార్యక్రమంలో అబ్బవరం మధుసూదన్, వీరబల్లి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి నిర్లక్ష్యపు జబ్బు

- నిధులు ఫుల్... మందులు నిల్
- వైద్య సేవలు అందక విద్యార్థుల అవస్థలు
- పట్టించుకోని వైవీయూ అధికారులు



వైవీయూలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రాన్ని నిర్లక్ష్యపు జబ్బు పట్టిపీడిస్తోంది. సమృద్ధిగా నిధులున్నా మందులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు. తేలికపాటి జ్వరం వచ్చినా మందులు లేక 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న రిమ్స్ హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో వెళ్లాల్సిన దుస్థితి. దీంతో సరైన వైద్యం అందక విద్యార్థులు పడుతున్నారు. దీనిపై వైవీయూ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యోగివేమన విశ్వవిద్యాలయంలో విద్యార్థులు, పరిశోధన స్కాలర్లు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలకు 24 గంటలు సేవలందించేందుకు 2006లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొంతకాలం వైద్య సేవలు బాగా కొనసాగాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడ సేవలు కుంటుపడ్డాయని చెప్పవచ్చు. దీనికి ప్రధాన కారణం రెగ్యులర్ వైస్ చాన్సలర్ ఉన్నప్పటికీ వైసీపీ నాయకులు ఆడిందే ఆట పాడిందే పాటగా చెల్లుబాటు అయింది. దీంతో యదారాజా తదా ప్రజా అన్న చందంగా అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆరోగ్య కేంద్రం నిర్వహణ, అవసరమైన మందుల సేకరణకు ప్రతి నెల యూనివర్సిటీ రూ.50వేలు మంజూరు చేస్తుంది. అయితే ఈ నిధుల వినియోగంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధన స్కాలర్లు, ఉద్యోగులు అందరు కలిపి దాదాపు 3500 మంది వరకు ఉన్నారు. వీరిలో 2000 మంది వరకు విద్యార్థులు క్యాంపస్ హాస్టల్స్‌లో ఉంటున్నారు. వీరికి కనీసం జ్వరం, జలుబు, తలనొప్పి వంటి సీజనల్ వ్యాధులు వచ్చినా వాటికి మందులు లేక అవస్థలు పడుతున్నారు. ఇక యూనివర్సిటీ క్యాంపస్‌లో ఉన్న మహిళల పరిస్థితి చాలా దయనీయమని చెప్పాలి. ఏ సమస్య వచ్చిన దాదాపు 15కిలోమీటర్లు ప్రయాణించి కడప టౌన్‌కు వచ్చి మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్య కేంద్రం మెయింటెనెన్స్‌కు ఏడాదికి రూ. 6 లక్షల బడ్జెట్‌ను యూనివర్సిటీ కేటాయిస్తుంది. అయితే ఈ బడ్జెట్ మొత్తం ఎటువైపు పోతుందో తెలియని పరిస్థితి.

కేంద్రంలో లభించాల్సిన సౌకర్యాలు

యూనివర్సిటీ ప్రారంభించినది మొదలుకొని గత టీడీపీ ప్రభుత్వ హయాం వరకు ఆరోగ్య కేంద్రం ఉపయోగకరంగా ఉండేది. ఆరోగ్య కేంద్రంలో ప్రధానంగా సీపీఆర్ ప్యాకెట్ మాస్క్, టోర్నికెట్, రోలర్, గాజుగుడ్డ, ప్యాడ్లు, మెడికల్ ట్యాప్‌లు, త్రిభుజాకార బ్యాండేజీలు, సామ్ స్ప్రిం ట్, ఎలాస్టిక్ బ్యాండేజ్, టట్రా మాషియర్స్, యాంటి సెప్టి క్ సొల్యూషన్, యాంటీబయాటిక్ ఆయింట్‌మెంట్, హెచ్2 ఓ2, కాటన్, ఆల్కహాల్ ఆధారిత స్పిరిట్, సెలైన్ మొద లైన అన్ని వస్తువులు ఉండేవి. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవేవీ కూడా అందుబాటులో లేవనే చెప్పాలి. అలాగే కేంద్రంలో క్లినికల్ ల్యాబ్, ఈసీజీ, బయో-కెమికల్ ల్యాబ్ ఉన్నప్పటికీ నిరుపయోగమని చెప్పాలి.




తెరవకుండా ఉన్న ఫార్మసీ గది, మందులు లేని దృశ్యం

జ్వరం బిల్ల కావాలన్నా రిమ్స్‌కే..

విశ్వవిద్యాలయంలో అత్యవసర కేసులకు వైద్యం నిర్వహిం చేలా 2008 నుంచి రిమ్స్‌తో విశ్వవిద్యాలయం ఎంఓయూ చేసుకుంది. అయితే ప్రస్తుతం ఆరోగ్య కేంద్రంలో మందు లు లేకపోవడంతో చిన్న అనారోగ్య సమస్య తలెత్తినా, కనీసం జ్వరం మాత్ర కావాల్సి వచ్చినా యూనివర్సిటీ అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించి అక్కడ వైద్యం చేయించే పరిస్థితి నెలకొంది. ఆరోగ్య కేంద్రానికి బడ్జెట్ ఉన్నప్పటికి ఈ దుస్థితి ఎందుకు ఉన్నదో అధికారులే చెప్పాలి.

మందుల కొనుగోళ్లలో కిరికిరి

ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన మందులు కొనుగోలులో కూడా పెద్ద స్కాం జరిగినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వ హయాంలో మెడిసిన్ కొనాలంటే పక్కనే ఉన్న రిమ్స్‌లో కొనుగోలు చేయకుండా పులివెందుల నియోజకవర్గం వేంపల్లె నుంచి కొనుగోలు చేయడంలో మతలబు ఏమిటో తెలియాల్సి ఉంది. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తే అసలు నిజం బయటకు వచ్చే అవకాశం ఉంది.



ఇ-టెండర్ల ద్వారా మెడిసిన్ కొనుగోలు చేయాలి

ఇ-టెండర్ల ద్వారా మెడిసిన్ కొనుగోలు చేయాలి. అయితే డాక్టర్ అందుబాటులో ఉండడం లేదు. ప్రస్తుతం బడ్జెట్ రూ.80వేలకు పెంచడం జరిగింది. మందులు కొను గోలు చేయాలంటే ఇ-టెండర్ పిలవాల్సిందే. మే, జూన్ నెలలో విద్యార్థులు క్యాంప స్‌లో లేని కారణంగా కొంత ఆలస్యం జరిగింది. ప్రస్తుతం టెండర్లు పిలిచేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. త్వరలో ఆరోగ్య కేంద్రంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి.

-ప్రొఫెసర్ పి.పద్మ, రిజిస్ట్రార్, వైవీయూ

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గం

● ఏపీయూడబ్ల్యూజే

కడప ఎడ్యుకేషన్, జూలై 9 (ఆంధ్ర జ్యోతి): చిత్తూరు ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ ఫొటోగ్రాఫర్ శివకుమార్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం హేయమైన చర్య అని.. తక్షణమే దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పల్లెటి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి ఎక్కంటి ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవాధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. బుధవారం బంగారుపాలెం జగన్ పర్యటనలో వైసీపీ మూకల దౌర్జన్యంపై వారు మండిపడ్డారు. యార్డులో జగన్ రైతులతో మాట్లాడే ఫొటోలు తీస్తున్న శివకుమార్‌పై సుమారు పది మంది చుట్టుముట్టి చొక్క చించేసి విచక్షణారహితంగా కొట్టడం చూస్తే వైసీపీ నాయకులకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని అర్థమవుతోందన్నారు. ఉదయం నుంచి తీసిన ప్రోగ్రాం ఫొటోలు ఉండే మెమొరీ కార్డు లాక్కున్నారని తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సైగ చేయంతో దాడి ప్రారంభమైందని... దీనికి బాధ్యులుగా అతనిపై కేసు నమోదు చేయాలన్నారు. చిత్తూరు వైసీపీ ఇన్‌చార్జి విజయానందరెడ్డి చూస్తుండగా దాడి జరగడం వైసీపీ నేతల ప్రోద్బలంతో జరి గిందనడానికి నిదర్శనమన్నారు. తక్షణమే దాడి చేయడానికి ప్రోత్సహించిన వారిని అరెస్టు చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కె.బొమ్మేపల్లె డీకేటీ భూములపై విచారణ


రైతులను విచారిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

కొండాపురం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.బొమ్మేపల్లె గ్రామానికి చెందిన డీకేటీ భూములపై ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ బుధవారం విచారణ చేపట్టారు. కె.బొమ్మేపల్లె డీకేటీ భూముల్లో భారీగా అవకతవకలు జరిగాయని సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కలెక్టర్, జేసీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో జేసీ ఆదేశాల మేరకు ఆర్డీవో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించారు. ఈ భూములకు సంబంధించి చాలామంది అనర్హులుగా ఉన్నారని, తప్పుడు రికార్డులు సృష్టించి పరిహారం పొందాలని చూస్తున్నారని పలువురు రైతులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురప్ప, ఆర్ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా రీసర్వే నిర్వహించండి


రీసర్వేలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దమండ్యం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) బాధ్యతగా భూముల రీసర్వే పనులు నిర్వహించాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఆదే శించారు. మండలంలో బుధవారం పర్యటించారు. బండ్రేవు రెవెన్యూ గ్రా మంలోని దిగువపల్లి పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించా రు. ప్రధానంగా దిగువపల్లి ప్రాంతంలోనే బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం కోసం 756. 30 సెంట్ల ప్రభుత్వ భూముల సేకరణ వివరాలను సబ్‌కలెక్ట ర్‌కు తహసీల్దార్ తేజశ్వి, డీటీ రాజేష్‌కుమార్, మండల సర్వేయర్ హసీన్‌తాజ్ వివరాలు వివరించారు. రీసర్వేలతో పాటు ప్లాంట్ భూసేకరణ పనుల ను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం లో రెవెన్యూ అధికారులు, జీఎస్ సర్వేయర్లు, వీఆర్వోలతో సబ్‌కలెక్టర్ మాట్లా డుతూ అధికారులు, రైతులుతో రీసర్వే బృందాలు మాట్లాడి ఉమ్మడి సర్వే భూములు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మ్యుటేషన్‌లో వివరాలు రైతుల కు సమస్యలు పరిష్కార దిశగా ముందుకు సాగాలన్నారు. క్షేత్రస్థాయిలో వివరాల భూసేకరణ పక్కాగా వుండాలన్నారు.

పారదర్శకంగా క్రీడా పాఠశాల జిల్లాస్థాయి ఎంపికలు



విద్యార్థుల సర్టిఫికెట్స్ పరిశీలిస్తున్న సిబ్బంది, రన్నింగ్ చేస్తున్న విద్యార్థులు

కడప స్పోర్ట్స్, జులై 9 (ఆంధ్రజ్యోతి): వైయస్ఆర్ క్రీడా పాఠశాలలో ప్రవేశానికి నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి వెల్లడించారు. 4,5 తరగతులలో ప్రవేశానికి సంబంధించి తొలుత బుధవారం 4వ తరగతి ప్రవేశానికి గాను హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు ఫిజికల్ టెస్ట్ నిర్వహించి, అందులో నలుగురిని అనర్హులుగా గుర్తించి తిరస్కరించామన్నారు. మరో 9 మంది సరైన సమయానికి హాజరు కాలేకపోయినట్లు వెల్లడించారు. వీరికి ఈనెల 11న మరో అవకాశం కల్పిస్తామని తెలిపారు. తొలిరోజు ఎంపికలలో పాల్గొన్న అర్హులైన 40 మందిలో 27 మందికి ఎత్తు, బరువు, మెడిసిన్, బాల్‌పుట్, స్టాండింగ్ బ్రాడ్‌జంప్, ఫ్లెక్సిబిలిటీ, 6ఇంటు10 షటిల్‌రన్, 30 మీటర్స్ ఫ్లైయింగ్ స్టార్ట్, 600 మీటర్స్ పరుగు పందెం తదితర టెస్ట్‌లు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు సాయి ప్రశాంత్, సతీష్‌కుమార్, స్పోర్ట్స్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నిర్లక్ష్యమే ఆర్కిటెక్చర్ విద్యార్థులకు శాపం

చెన్నూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఆర్కిటెక్చర్ కాలేజీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు బుధవారం పొలిట్‌బ్యూరో సభ్యుడు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్వాకం వల్లనే కాలేజీకి సీవోఏ గుర్తింపు రాలేదన్నారు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కళాశాల ఏర్పాటు చేసేటప్పుడే గుర్తింపు ఉండాలన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. పైగా ప్రైవేటు బిల్డింగులలో కాలేజీలు నడుపుతూ నెలకు లక్షల్లో అద్దెలు కడుతున్నారు.. దీనిపై ఇంత వరకు ఎందుకు దృష్టి పెట్టలేద న్నారు. విద్యార్థులు తమ సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేయడం బాధాకరమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కాగా, తమ సమస్యల పరి ష్కారానికి దీక్ష చేస్తున్న ఆర్కిటెక్చర్ విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి సంఘీభావం తెలిపారు. విద్యార్థుల సమస్యలు తెలుసు కొని ఆయన యూనివర్సిటీ ఈసీ విశ్వనాథకుమార్‌తో చర్చించారు.


టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆర్కిటెక్చర్ విద్యార్థులు

ఆధిక్యతలో కర్నూలు, కడప జట్లు

కడప స్పోర్ట్స్, జులై 9 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-19 మల్టీడే క్రికెట్ వేర్వేరు జట్ల మధ్య సాగుతున్న మ్యాచ్‌లలో బుధవారం ప్రత్యర్థి జట్లపై కర్నూలు జట్టు 174 పరుగుల ఆధిక్యత సాధించగా, కడప జట్టు 319 పరుగుల ఆధిక్యత సాధించిచింది. వివరాలిలా..... కేఓఆర్‌ఎం మైదానంలో కర్నూలు- చిత్తూరు జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెండోరోజు బుధవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 63.4 ఓవర్లలో 251 పరుగులకు కుప్ప కూలింది. కాగా కర్నూలు జట్టు తన రెండవ ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. ఇందులో మురారీ హృదయ్ 60 పరుగులు చేశారు. దీంతో కర్నూలు జట్టుకు 174 పరుగుల ఆదిక్యతలో నిలిచింది.

ఏసీఏ మైదానంలో కడప- అనంతపురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో ఓవర్‌నైట్ స్కోర్ 461 పరుగులతో తిరిగి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 93.2 ఓవర్లలో 495 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో ఆర్థిత్‌రెడ్డి 100 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు 67 ఓవర్లలో 250 పరుగులకే చేతు లెత్తేసింది. ఇందులో వీరారెడ్డి 133 పరుగులు చేశారు. దీంతో కడప జట్టుకు 211 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు ఆట ముగిసే సమయానికి 15 ఓవర్లలో 74 పరుగులు చేసింది.

మధ్యవర్తిత్వంపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రత్యూషకుమారి

కడప రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంపై అవగాహనను పెంపొందించుకొని తద్వారా కేసులను సులువుగా పరిష్కరించుకోవాలని డీఎల్ఎస్ఏ ఇన్‌చార్జ్ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో శిక్షణ పొందిన మధ్యవర్తుల(న్యాయవాదులు)కు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మధ్యవర్తిత్వ ప్రతిష్టంభనలు, రాజీ ఒప్పందాలను అధిగమించడం, ఆధునిక మధ్యవర్తిత్వ సవాళ్లను నావిగేట్ చేయడం, కేస్ స్టడీస్, గ్రూప్ యాక్టివిటీ, బహుళ పార్టీ సాంస్కృతిక ఒప్పంద వ్యూహాలు తదితర అంశాలను తెలియపరిచారు. కార్యక్రమంలో న్యూఢిల్లీకి చెందిన అడ్వకేట్, సీనియర్ ట్రైనర్ అనూష సక్సేనా, మధ్యప్రదేశ్‌కు చెందిన అడ్వకే ట్, సీనియర్ ట్రైనర్ మీనా కేర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

'మాజీ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోండి'

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంత్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హోంమంత్రి అనితకు విజయవాడలో రాష్ట్ర హజ్‌కమిటీ సభ్యుడు, మైనార్టీ నేత పఠాన్ ఖాదర్‌ఖాన్ వినతిపత్రం అందజేశారు. మహిళా ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలు హేయమన్నారు. ప్రజాప్రతినిధిని హేళనగా మాట్లాడడం దారుణమన్నారు. అన్ని ఆధారాలు ఉన్నా పోలీసులు చర్యలు చేపట్టడం లేదన్నారు. మహిళా సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా, పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

దీర్ఘకాలిక పంటలు సాగు చేయాలి

పోరుమామిళ్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటలకు బదులు దీర్ఘకాలిక పంటలను సాగు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి రవి చంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గురప్పగారిపల్లెలో ఆయిల్‌పాం మెగా ప్లాంటేషన్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం స్థానిక స్త్రీశక్తి భవన ఆవరణలో పామాయిల్ మొక్కలు నాటే కార్యక్రమం నియోజకవర్గ టీడీపీ యువనేత రితీష్‌కు మార్‌రెడ్డి కలిసి ప్రారంభించారు. అనంతరం రంగసముద్రం రైతు సేవా కేంద్రంలో ఉద్యాన శాఖ రీఆగ్రో ఇండస్ట్రీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయిల్‌పాం సాగు, ప్రభుత్వ ప్రోత్సాహాలు వివరించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు.

36 బ్యాటరీలు చోరీ

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్ర జ్యోతి): మదనపల్లె పట్టణం టిప్పుసుల్తాన్ మైదానంలో నిలిపిన లారీలు, ట్రాక్టర్లు, ఐషర్లు, టిప్పర్ల నుంచి మంగళవారం రాత్రి 36 బ్యాటరీలు చోరీ చేశారు. బుధవారం యాజమానులు గంగాధర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, మధుకర్‌రెడ్డి, అశోక్‌కుమార్ టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు విచారణ చేపట్టారు. రాత్రి కావడం ఎవరూ లేకపోవడంతో గమనించిన దుండగులు ఈచోరీకి పాల్పడారన్నారు.

సబ్‌జైలు తనిఖీ

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్‌జైల్‌ను బుధవారం రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్ తనిఖీ చేశారు. జైళ్ల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. జైళ్లలో నిందితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలర్లు భద్రత కల్పించాలన్నారు. జిల్లా జైలు శాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, మదనపల్లె సబ్ జైలు సూపరింటెండెంట్ లక్ష్మణరావు, డీఎస్పీ మహేంద్ర, వన్ టౌన్ సీఐ ఎర్రిసావలి, పాల్గొన్నారు.

గోడౌన్‌లో సరుకు బయటకు పోనివ్వం

- గేటుకు తాళం వేసి లారీలను అడ్డుకున్న రైతులు
- భూపేశ్‌రెడ్డి హామీతో పొగాకు పంట తరలింపు
- మా పరిస్థితి ఏంటి అంటున్న మరికొందరు రైతులు



జీపీఐ కంపెనీ సరుకు లారీలు బయటకు వెళ్లకుండా అడ్డుకున్న రైతులు, గోడౌన్‌లోపల నిలిచి వున్న లోడు లారీలు

ముద్దనూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ముద్దనూరు లోని యశ్వంత్ గోడౌన్ వద్ద మూడు రోజులుగా పెద్దముడియం మండలం సుంకేసుల, ముద్దనూరు మండలం పెద్దదుద్యాల, జమ్మలమడుగు రైతులు జీపీఐ కంపెనీ వారు పొగాకును కొనుగోలు చేయాలని ఆందోళన చేస్తున్నారు. అయితే జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి అళ్లగడ్డ సమీపంలోని జీపీఐ కంపెనీ వారి గోడౌన్‌లోపొగాకు పంట విక్రయిస్తారని తెలపడంతో పెద్దముడియం మండలం రైతులు బుధవారం పంటను తరలించారు. అయితే మా పరిస్థితి ఏమిటనిముద్దనూరు, జమ్మలమడుగు రైతులు ఆందోళనచెందుతున్నారు. రైతుల సమాచారం మేరకు.. జీపీఐ కంపెనీ వారు రైతులను పొగాకు పంట సాగు కోసం నారు ఇచ్చి, పంట కొనుగోలు చేస్తామని ప్రోత్సహించారు. ముద్దనూరులోని యశ్వంత్ గోడౌన్‌లో ఆ కంపెనీ వారు పొగాకు విక్రయం చేపట్టారు.ఇదే క్రమంలో పెద్దముడియం, ముద్దనూరు, జమ్మలమడుగు రైతులు పొగాకు గోడౌన్ వద్దకు తేగా కంపెనీ వారు విక్రయం లేదన్నారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆందోళన చేపట్టారు. రాత్రింబవళ్లు రైతులు గోడౌన్ వద్దనే కాపలా ఉండి గోడౌన్‌లోని సరుకు తరలించకుండా లారీలను అడ్డుకున్నారు. పంటను కొనుగోలు చేసేంత వరకు వెళ్లేది లేదన్నారు. పంట తీసుకొచ్చిన ట్రాక్టర్లను గోడౌన్ వద్ద ఉంచారు. దీంతో పంట కొనుగోలు చేస్తామని కంపెనీ వారు తెలియజేశారని భూపేష్ రెడ్డి తెలపడంతో పంటను అళ్లగడ్డకు తరలించారు. అయితే ముద్దనూరు, జమ్మలమడుగు రైతులు మా పరిస్థితి ఏమిటని,స్థానికంగా ఉన్న గోడౌన్‌లోనే తమ పంటను విక్రయించాలని రైతు అశోక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

కదం తొక్కిన కార్మికులు

ఉద్యమించిన కార్మిక సంఘం నేతలు ● పంచాయతీ కార్మికులు, అంగన్వాడీల నిరసన ● కార్మిక చట్టాలను రక్షించుకుందామని ర్యాలీలు ● తహసీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా ● లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్





పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు - పీటీఎం మెయిన్ రోడ్డులో అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికుల మానవహారం - తంబళ్లపల్లెలో ర్యాలీ...

పీలేరు, జూలై 9(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ బిల్లులపై బుధవారం పీలేరు కార్మిక లోకం కదం తొక్కింది. వాటిని ఉపసంహరించుకునేంత వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేసింది. దేశవ్యాప్త నిరసనలో భాగంగా పట్టణంలోని పలు సంఘాలు, కార్మికులు భారీ ర్యాలీ, నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య మాట్లాడుతూ కార్మికులు తమ ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కాలరాస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చిందన్నారు. తద్వారా బడా కంపెనీలకు అనుకూలంగా చట్టాలు మార్చి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారన్నారు. విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న 4 డీఏలు విడుదల చేయాలని, ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు బదిలీ చేయాలని, 2014 నుంచి కోర్టు పెండింగ్‌లో ఉన్న జేఎల్ఎం గ్రేడ్-2 వారికి ప్రమోషన్లు ఇవ్వాలని, విశ్రాంత పీఎఫ్ ఉద్యోగులకు మెడికల్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నేతలు వెంకటయ్య, ఓబులయ్య, నాగార్జున, పులి రెడ్డప్ప, రమేశ్, గోపి, రాజేశ్వరి, చిట్టెమ్మ, రాధారాణి, శ్యామల, భాగ్య, సుబ్బలక్ష్మి, కరీముల్లా, పురుషోత్తం, ముబారక్, శ్రీనివాసులు, రాజేశ్వరి, సరోజ పాల్గొన్నారు.

అదనపు పనిభారం మాకొద్దు..

వాల్మీకిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీలో నిత్యం సేవలందిస్తున్న తమకు అదనపు పనిభారం వద్దని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయం ఎదుట విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. పంచాయతీ కార్మికులందరూ విధులు బహిష్కరించడం, పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు.

సుప్రీం కోర్టు కూడా పనికి సమాన వేతనం ఇవ్వాలని ఇచ్చిన తీర్పును గుర్తు చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. కార్మికులకు పోరాడే హక్కును లేకుండా చేస్తున్నారని, పని గంటలను కేంద్రం 12, రాష్ట్ర ప్రభుత్వం 10కి పెంచడం ఇందుకు నిదర్శనమన్నారు. కార్మికులు శ్రీరాములు, వెంకటేష్, నాగరాజ, శివ, జయరామ్, హరి, చంద్ర, రాజు, శ్రీనివాసులు, రాముడు, ఓం, వసంతమ్మ పాల్గొన్నారు.

అంగన్వాడీల ధర్నా

మండలంలోని అంగన్వాడీ మహిళా కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన చేపట్టారు. యూనియన్ అధ్యక్షురాలు చంద్రావతి, కార్యదర్శి భూకైలేశ్వరి, సభ్యులు గాయత్రి, రమాదేవి, శారద, దేవసేన, పార్వతి, వీఓఏలు నిర్మల, ప్రసన్న, పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

మదనపల్లె టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికులపై వేధింపులు మానుకోవాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో భాగంగా అంగన్ వాడీలు, ఆశా వర్కర్లు, హమాలీ వర్కర్లు, పంచాయతీ వర్కర్లు, బీఎస్ఎన్ఎల్ కార్మికులు తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. నిరసన ర్యాలీకి అనుమతి లేదని, ప్రజలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించడంతో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకే నిరసన ర్యాలీ చేపట్టి విరమించారు. అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్స్ అసోసియేషన్ నాయకురాళ్లు మధురవాణి, రాజేశ్వరి, గంగాదేవి, సీఐటీయూ నేతలు ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ, ఆశా వర్కర్స్ నాయకురాళ్లు సవిత, జయమ్మ, కార్మిక సంఘాల నేతలు కృష్ణమూర్తి, గోపాల్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలి

గుర్రంకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కనీస వేతనం ఇవ్వాలంటూ గుర్రంకొండలో కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. మండలంలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, సంఘమిత్రలు, పంచాయతీ కార్మికులు కలిసి సంతగేట్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపరింటెండెంట్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ నేతలు రమేష్ బాబు, మెహరునీస్సా, శారద, రోజా, సావిత్రి, రమణ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

సమాన వేతనం ఇవ్వాలి

కలకడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిప్రసాద్ డిమాండ్ చేశారు. కార్మికులు కలకడ సచివాలయం ఎదుట నిరసన చేపట్టారు. కార్మికులు సాయిబాబు, వీరాంజనేయు లు, రామచంద్ర, అమరావతి, శ్యామల పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రక్షించుకుందాం

పెద్దతిప్పసముద్రం జూలై 9 (ఆంధ్రజ్యోతి): కార్మిక చట్టాలను పరిరక్షించుకునేందుకు కార్మికులంతా ఏకమవ్వాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర బాబు అన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్ వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్మికులు, స్వచ్ఛభారత్ కార్మికులు, కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన చేపట్టారు. వర్కర్స్ యూనియన్ నేతలు శ్రీవాణి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మావిళ్ల వెంకటాచలపతి, పంచాయతీ కార్మికులు తమక శంకర, పి. రమణ, కే. రామచంద్ర, స్వచ్ఛభారత్ కార్మికులు ఎస్. నాగరాజు,లక్ష్మీ, శంకరమ్మ, ఆదేమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు లక్ష్మీదేవి, ఆశా కార్మికులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

కురబలకోట, జూలై 9(ఆంధ్రజ్యోతి): న్యాయమైన తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ ధనం జనేయులకు అందజేశారు. తస్లీమ్, దిల్‌షాద్, రమాదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలి

రామసముద్రం, జూలై 9(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సిబ్బందిని రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్వాడీ ఉద్యోగులు, ఆశా వర్కర్లు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతి పత్రం ఇచ్చారు.

తంబళ్లపల్లెలో మానవహారం

తంబళ్లపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): పనికి సమాన వేతనం ఇవ్వాలని అంగన్వాడీ వర్కర్లు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు, కార్మికులు నిరసన తెలిపారు. రాగిమాను కూడలి నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు నిరసన ర్యాలీ చేపట్టి మానవహారం నిర్వహించారు.

కొత్త ఓటర్ల నమోదుకు ఇంటింటి సర్వే

పీలేరు రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కొత్త ఓటర్ల నమోదు కోసం ఇంటింటి సర్వే నిర్వహించాలని కలకడ తహసీల్దార్ మహహేశ్వరిబాయి తెలిపారు. పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో రోజు కలకడ మండల బీఎల్ఓల శిక్షణలో ఆమె మాట్లాడుతూ తప్పుల తడకలు లేని ఓటర్ల జాబితా రూపొందించడం కోసం పీలేరు నియోజక వర్గంలోని బీఎల్ఓలకు 8వ తేదీ నుంచి 16 వరకూ మండలాల వారీ శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు. శిక్షణా శిబిరంలో పీలేరు ఏఎస్ఓ రెడ్డెప్పనాయుడు, కలకడ, పీలేరు మండలాల పరిధిలోని బీఎల్ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం సురక్షితం



గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ జులేఖాబేగం

వాల్మీకిపురం, జూలై9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు సురక్షితమని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖా బేగం సూచించారు. ప్రతి నెలా 9వ తేదీన నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా ఆస్పత్రిలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. 32 మంది గర్భిణులకు ఎత్తు, బరువు, రక్తపోటు, చక్కెర, మూత్ర, రక్తపరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. రెండు, మూడో కాన్పు మహిళలను ఆస్పత్రులకే వచ్చేలా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం ద్వారా ఎన్టీఆర్ బేబీ కిట్, సురక్ష యోజన పథకం ద్వారా వారి ఖాతాలకు రూ.1000 జమ చేస్తారని, ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం ద్వారా రూ.5వేలు కూడా వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. కాన్పు అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, టీకాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ, డాక్టర్లు సాయిశ్రీ, సనాఆయేషా, సీహెచ్ఓ అరుణ, సూపర్‌వైజర్లు భాను, బావుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తాం

● మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి

గుర్రంకొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసి పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని మాజీ రాజ్యసభ సభ్యుడు తులసిరెడ్డి పేర్కొన్నారు. గుర్రంకొండలో బుధవారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధి మార్గంలో ముందడుగు చేస్తుందని తెలిపారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలపరుస్తామని చెప్పారు. అనంతరం బస్టాండులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు ఫిరోజ్, సమీర్, వెంకటేష్, బాబా, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో సవరణలకు అవకాశం

కలికిరి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో నిధులు విడుదల కానున్న అన్నదాత సుఖీభవ పథకంలో అర్హులు, అనర్హులైన రైతుల జాబితాలను బుధవారం నుంచి ఆయా సచివాలయాల్లో పరిశీలనలో వుంచినట్లు ఏఓ హేమలత తెలిపారు. అర్హులందరికీ త్వరలో మొదటి విడత నిధులు జమచేయబడతాయన్నారు. అర్హులమో కాదో నిర్ధారించుకోవడానికి స్థానిక రైతు సేవా కేంద్రాల సిబ్బందితో నిర్ధారించుకోవాలని సూచించారు. ఒక వేళ అనర్హులైతే వివరాలు పరిశీలించి రైతు సేవా కేంద్రాల సిబ్బంది లాగిన్‌లో ఫిర్యాదులు నమోదు చేయాలని కోరారు. వెబ్‌ల్యాండ్‌లోని ఖాతాలకు ఆధార్ అనుసంధానం తేడా జాబితాలను తహసీల్దారుకు పంపామన్నారు.

రాష్ట్రంలో పాలనపై ప్రజలు బ్రహ్మరథం




మదనపల్లె ఒకటో వార్డులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పెద్దమండ్యం మండలం పాపేపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి

మదనపల్లె టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాలనపై ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. బుధవారం ఒకటో వార్డులో సుపరిపాలన- తొలిఅడుగులో భాగంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వైసీపీ నేతల వికృత చేష్టలు చూసి అక్కడి ప్రజలు అసహ్యించుకున్నారన్నారు. మదనపల్లెలో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు వారి పాలనలో అభివృద్ధిని మరిచారని, పదేళ్ల కిందట తాను వేయించిన రోడ్లే ఇప్పటికీ దర్శనమిస్తున్నాయన్నారు. కౌన్సిలర్ నాగార్జున గాంధీ, టీడీపీ నేతలు డాన్స్ రెడ్డెప్ప, ఎర్రబల్లి వెంకట రమణారెడ్డి, మల్లికార్జున, భాస్కర్, సుధాకర్ పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో....

పెద్దమండ్యం, జూలై 9(ఆంధ్రజ్యోతి) ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్దే సీఎం చంద్రబాబు ధ్యేయమని తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏడాది పాలనలో భాగంగా పాపేపల్లిలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర అభివృద్ధిపై కరపత్రాలను ఇచ్చి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు సిద్దవరం ప్రసాద్ యువనేత బీటెక్ సుమన్, టీడీపీ నేతలు గల్లా నారాయణ, వెంకటరమణ, మహేంద్ర, యుగంధర్‌రెడ్డి, గంగాధర, మహేశ్వర, చంద్రారెడ్డి, ఇస్మాయిల్, ఫరూక్, నాగేశ్వరరెడ్డి, సీతాపతిరెడ్డి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో...

తంబళ్లపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు దేరంగుల చంద్ర అన్నారు. గ్రామాధ్యక్షులు జగదీశ్వర, మధుకర్‌రెడ్డి, పార్లమెంట్ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి సోముశేఖర్, వార్డు సభ్యుడు జగదీష్, రాధాశెట్టి, మాజీ జడ్పీటీసీ రామచంద్ర, తెలుగు యువత నరసింహులు, నరేంద్రనాయుడు పాల్గొన్నారు.

కురబలకోటలో...

కురబలకోట, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందివ్వడమే సీఎం ధ్యేయమని నియోజకవర్గ కో ఆర్డినేటర్ మల్లికార్జునాయుడు అన్నారు అంగళ్ళు నందిరెడ్డిగారిపల్లె, బ్రాహ్మణొడ్డుపల్లె, పోరెడ్డివారి పల్లె తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. నియోజక వర్గ కో ఆర్డినేటర్ మల్లికార్జుననాయుడు, సురేంద్ర, శెట్టి సీతారాం, అయూబ్ బాషా పాల్గొన్నారు.

పశువులకు పచ్చిగడ్డి ఆరోగ్యం

ఉప సంచాలకులు డాక్టర్ నీరజ

తంబళ్లపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): పశువులకు పచ్చిగడ్డి ఆరోగ్యకరమైన ఆహారమని పశుసంవర్ధక శాఖ ఉప సంచాలకులు(డీడీ) డాక్టర్ నీరజ అన్నారు. మండలంలో డీడీ ముమ్మరంగా పర్యటించారు. కోటకొండ రైతు సేవా కేంద్రం పశుగ్రాస వారోత్సవాల్లో పాడి రైతులకు పచ్చి గడ్డి ప్రాముఖ్యత, పచ్చి గడ్డి ఆవులకు వేయడంతో ప్రయోజనాలు, వివిధ పశు గ్రాస రకాలు, సబ్సిడీపై పశు గ్రాస విత్తనాల పంపిణీ, ఉపాధి పథకంలో పచ్చిగడ్డి సాగు తదితర విషయాలపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. రేణుమాకులపల్లెలో గొర్రెలకు వేస్తున్న నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. తదనంతరం కోటకొండ, కన్నెమడుగు పశు వైద్య కేంద్రాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జేవీఓ హేమాపతిరెడ్డి, పశు వైద్యాధికారి విక్రమ్‌రెడ్డి, సహాయకులు శ్రీనివాసులు, వెంకట్రమణ పాడి రైతులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను కలిసిన నరేంద్రారెడ్డి

వాల్మీకిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ నూతన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం విజయవాడ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నూతన అధ్యక్షుడు మాధవ్‌ను రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్రమోహన్‌తో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో బీజేపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని తెలియజేశారు.

రైతులకు ఏం చేశారని వచ్చారు?

టీడీపీ నేత మల్లికార్జుననాయుడు విమర్శ

మదనపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో రైతులకు ఏం చేశారని, ఏ మొహం పెట్టుకుని మామిడి రైతుల పరామర్శ పేరుతో వచ్చా రని మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డిని టీడీపీ తంబళ్లపల్లె సమన్వయకర్త కె.మల్లికార్జుననాయుడు ప్రశ్నించారు. ఐదేళ్లలో రైతులను నిండా ముంచింది వైసీపీనేనని ఆయన మండిపడ్డారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం రైతులకు 90శాతం రాయితీతో డ్రిప్ ఇరిగేషన్ ఇవ్వగా, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ ఆ స్కీమ్‌ను ఎత్తేయలేదా? అంటూ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ రుణాలు, వారికి రావాల్సిన పథకాలను దారిమళ్లిం చారంటూ మండిపడ్డారు. బ్రాందీషాపులతో ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. మామిడి రైతుల పరామర్శ పేరుతో హడావిడి చేస్తున్న వైసీపీ నేతలు మీ ఫ్యాక్టరీలకు ఎక్కువ ధర చెల్లించి మామిడి కొనుగోలు చేసి, రైతును ఆదుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

కలకడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహల్ క్రాస్‌లో నిర్వహిస్తున్న మహభారత యజ్ఞంలో భాగంగా బుధవారం జరిగిన దుర్యోధన వధ అభినయం చూపారులను ఆకట్టుకుంది. మహభారత సంగ్రామంలో భాగమైన ఈ యుద్ధ ఘట్టాన్ని కళాకారులు తమ నటన పటిమతో కొద్దిసేపు గాంభీర వాతావరణాన్ని సృష్టించారు. సమీప గ్రామల ప్రజలు తండోపతండా లుగా హజరై కార్యక్రమాన్ని ఆసక్తిగా తిలకించారు. నిర్వాహకులు మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

పెద్దమండ్యం, జూలై 9(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించి చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ నాగరాజు పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పెద్దమండ్యం, బండమీదపల్లి, వెలిగల్లు, కలిచెర్ల గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా గ్రామాభివృద్ధి సాధించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ సిబ్బంది బాధ్యతగా పని చేయాలన్నారు. ఎంపీడీఓ శ్రీధర్‌రావు, సర్పంచ్‌లు బయ్యారెడ్డి, విశ్వనాధ, సరస్వతి, కార్యదర్శులు సుబ్రమణ్యం,శైలజ, ఖాదర్‌బాష, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కూలీల శాతం పెంచకపోతే చర్యలు తప్పవు

నిమ్మనపల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): కూలీలకు ఉపాధి పనులు కల్పించకపోతే సిబ్బందిపై చర్యలు తప్పవని ఏపీడీ శ్రీనివాసులు హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా కూలీలకు ఉపాధి పనులు కల్పిచడంలో నిమ్మనపల్లి అట్టగున వుందన్నారు. కొండయ్యగారిపల్లి, ముష్టూరు గ్రామాల్లో పని చేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్లను తాత్కాలికంగా తొలగించామని వీరు వారం రోజుల్లోగా కూలీల శాతం పెంచితే విధుల్లో కొనసాగిస్తామన్నారు. రోజూ 1000 మంది కూలీలు పనిచేయాలని ఏపీఓ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, సీఎల్ఆర్‌సీ చందన ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటి పంటగా మార్చుకోవాలి



పొలంపిలుస్తోందిలో మాట్లాడుతున్న ఏఓ

నిమ్మనపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పంటలను లాభసాటిగా మార్చుకోవాలని ఏఓ మంజుల రైతులకు సూచించారు. రాచవేటివారి పల్లి, రెడ్డివారిపల్లి పంచాయతీల్లో పొలంపిలుస్తోందిలో ఆమె మాట్లాడుతూ రైతులు అన్నదాత సుఖీభవ పథకంలో రైతు పేరు ఉందా లేదా, రైతులు అర్హుల జాబితా, అనర్హుల జాబితాను సరిచేసుకుని వారి స్టేటస్‌ను సమీప రైతు భరోసా కేంద్రాల్లో చూసుకోవాలన్నారు. ఏమైనా అభ్యంతరాలు వుంటే 13వ తేదీ వరకు సరి చేసుకోవచ్చని తెలిపారు. వ్యవసాయ శాఖ సహాయకులు శ్రీకాంత్, నాయక్ పాల్గొన్నారు.

ఫీజు వేధింపులపై విచారణ జరిపించాలి

మదనపల్లె టౌన్, జూలై 9: అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. స్థానిక జ్యోతిరావుపూలే విగ్రహం ఎదుట ఎస్ఎఫ్ఐ నేతలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. నరసింహ మాట్లాడుతూ ఫీజుల ఒత్తిడితో ఓ విద్యార్థిని ఇంటి నుంచి అదృశ్యమైన ఘటనపై విద్యాశాఖ ఇంత వరకు విచారణ జరిపించ లేదన్నారు. జిల్లా ఉన్నతాధికారి దీనిపై దృష్టి పెట్టి విచారించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు అఫ్రిద్, జయబాబు, సమీర్, నాని, బన్నీ పాల్గొన్నారు.

ఈయూ గౌరవాధ్యక్షుడిగా నాగూర్‌వలి

మదనపల్లె టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఏపీపీటీడీ వన్, టు డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా మదనపల్లె టీడీపీ నేత నాగూర్‌వలిని నియమిస్తూ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య ఉత్తర్వులు జారీచేశారు. నాగూర్‌వలి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఈయూలో తనను గౌరవాధ్యక్షుడిగా నియమించడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. శుక్రవారం ఈయూ 74వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మదనపల్లెలో నిర్వహించే సమావేశానికి కార్మికులందరు తరలిరావాలని కోరారు.

మాజీఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): మహిళ ఎమ్మెల్యే పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన కోవూరు మాజీ ఎమ్మెల్యే ఎన్.ప్రసన్నకుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని జనసేన నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా, అందులోనూ మహిళ ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వీర మహిళలు సాయి లీలావతి, స్వర్ణలత, భారతి, విజయలక్ష్మి, హసిని, క్రియాశీలక కార్యకర్తలు జగదీష్, లీలాకర్, గురుప్రసాద్, కుమార్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా ప్రతాప్‌రెడ్డి

కలకడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ డిప్యూటీ ఎంపీడీఓగా ఆర్. ప్రతాప్‌రెడ్డి బాధ్యతలను చేపట్టారు. ఈయన ఇదే కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా పని చేస్తూ పదోన్నతి పొందారు. ఖాళీగా వున్న డిప్యూటీ ఎంపీడీఓ పోస్టులో ఆయనను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా ఆజాద్

ములకలచెరువు, జూలై 9(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా మహమ్మద్ ఆజాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ హరినారాయణ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షురాలిగా లావణ్య, కోశాధికారులుగా శివ ప్రసాద్‌నాయక్, శ్రీకాంత్ రెడ్డి, కార్యదర్శిగా రెడ్డి రాణి, సోషియల్ మీడియా కో ఆర్డినేటర్‌గా రఘునాధ్, సభ్యులుగా రామానాయక్, శివశంకర్ నాయుడు, విశ్వనాధ్, రాజెమ్మ, సుకన్య, ప్రసాద్ ఎన్నికయ్యారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

మదనపల్లె టౌన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ నిరంతరంగా పోరాడుతోందని ఆర్ఎస్ఎస్ నేత డీఆర్ నరేంద్ర పేర్కొన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రంగనాథ ఐటీఐ కళాశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏబీవీపీ కన్వీనర్ సాయిహితేష్, వెంకటరమణ, అశ్విన్, గౌతమ్, చక్రపాణి పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడిని కలసిన జబ్బల

మదనపల్లె, జూలై 9(ఆంధ్రజ్యోతి): కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.మాధవ్‌ను కలిశారు. విజయవాడలోని పార్టీ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్న ఆయన్ని, కలసి అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నేతలు, అసెంబ్లీ కన్వీనర్ భగవాన్, కనకదుర్గ సత్య, పట్టణ అధ్యక్షుడు బర్నేపల్లె రవికుమార్ ఉన్నారు.

బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్

కలకడ, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను విజయవాడ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు పీలేరు బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో సైతం బలోపేతం చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారన్నారు.

బీజేపీ అధ్యక్షుడిని కలిసిన బొజ్జప్ప

మదనపల్లె అర్బన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో బీజేపీ నూతన అధ్యక్షుడు మాధవ్‌ను బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు పి. బొజ్జప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. బీజేపీ విజయవాడ పట్టణ అధ్యక్షుడు అదూరి శ్రీరాములు, పార్టీ నేతలు వంశీకృష్ణ, కేశవనాయక్ కలిసి దుశాలువ కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బొజ్జప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీపార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో, మదనపల్లె నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి లోకేష్‌తో జయచంద్ర భేటీ

వాల్మీకిపురం, జూలై 9(ఆంధ్రజ్యోతి): చింతపర్తి టీడీపీ నేత లంకిపల్లె జయచంద్రనాయుడు రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ మంత్రి, నారా లోకేష్‌ను బుధవారం బెంగళూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఆధ్వర్యంలో యువతతో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అలాగే పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన తప్పక పరిష్కారిస్తానని చెప్పినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నేతలు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.